

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

## నేటి నుంచి జాతీయ పోషణ మాసోత్సవాలు



ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 243 | బుధవారం 09 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3

# చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు..

## రేపు 'నిజం గెలిచింది' కార్యక్రమానికి పిలుపునిచ్చిన నారా లోకేశ్

- రేపు 53 దీపాలు వెలిగించండి.. టీడీపీ శ్రేణులకు లోకేశ్ కీలక సందేశం
- పార్టీ, పర్సనల్, ప్రభుత్వం అనే మూడు 'పీ'ల సూత్రాన్ని నేతలు పాటించాలని దిశానిర్దేశం
- కార్యకర్తల పోరాటాలు, త్యాగాల వల్లే టీడీపీ అధికారంలోకి వచ్చిందని వ్యాఖ్య
- వైసీపీ దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని శ్రేణులకు సూచన
- ఇది టీడీపీ 3.0 వెర్షన్.. అహంకారం వీడి సేవ చేయాలని నేతలకు హితవు

2లో



టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు రేపటితో (సెప్టెంబర్ 9) మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 'నిజం గెలిచింది' పేరిట రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో నిర్బంధించినందుకు నిరసనగా, ఆయన నిర్దోషిగా బయటకు

# ఎల్‌నినో స్పీడ్ బ్రేకర్ లాగా వచ్చింది..

## చంద్రబాబు నాయకత్వంలో ఎదుర్కొంటాం:

- ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 56 శాతం వర్షపాతం లోటు
- విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం అందిస్తున్నారన్న అచ్చెన్న
- రైతులను గొడ్డలి పార్టీ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం 46 లక్షల మంది రైతులకు పంటల బీమా కల్పించిందని వెల్లడి
- గత ప్రభుత్వం ఐదేళ్లుగా పంటల బీమా ప్రీమియం కూడా చెల్లించలేదని ఆగ్రహం

2లో

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, ఇది అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్ లాగా పరిణమించిందని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో ఈ విపత్తును ఎదుర్కొని రైతులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ చర్యలపై ప్రసంగించారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం



# ఉత్తరాంధ్రలో వైసీపీకి భారీ షాక్

ఉత్తరాంధ్రలో వైసీపీకి భారీ షాక్.. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్‌కు పంపించారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా కూడా ఉన్న ఆయన.. పార్టీ క్రియాశీల సభ్యత్వానికి, పార్టీ పదవులకూ రాజీనామా చేయడమే గాక.. వెంటనే అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన కుమార్తెతో పాటు టీడీపీలో చేరడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. 26 ఏళ్ల రాజకీయ చరిత్రలో చిన్న శ్రీను తన మేనమామ బొత్స వద్దే శిష్యరికం చేశారు. ఆయన తర్వాత తానే మంత్రి అన్న తీరుగా వ్యవహరించారు. బొత్స కుటుంబం కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు చిన్నశ్రీనును అందరూ షాడో నేతగా భావించేవారు. పార్టీలో ఎటువంటి పదవీ లేకున్నా అధికార కేంద్రంగా ఉండేవారు. 2014 ఎన్నికల్లో బొత్స కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంది.

- పార్టీకి, విజయనగరం జడ్పీ చైర్మన్ పదవికి బొత్స మేనల్లుడు చిన్న శ్రీను రాజీనామా
- కుమార్తెతో కలిసి అమరావతిలో సీఎంతో భేటీ
- కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు
- ఇంటిపోరు రచ్చకెక్కి పార్టీ మార్పు..
- బొత్స కుమార్తెను జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించడంతో మనస్తాపం?

2లో



# కేసీఆర్ హత్యకు కుట్ర..

- కేసీఆర్‌కు రక్షణ కల్పించాలి
- బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే..
- కేటీఆర్ సంచలన ఆరోపణలు
- కేసీఆర్‌కు భద్రతపై పోలీసులపై నమ్మకం లేదు
- మన నాయకుడు కేసీఆర్ ను మనమే కాపాడుకోవాలి
- కేసీఆర్? ఫామ్?హౌస్?కు వెళ్తుండగా కేటీఆర్? అరెస్ట్?
- హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతల అరెస్టులు
- బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం..
- రాళ్లు, కుర్చీలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు

2లో

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడించడానికి ప్రయత్నించిన సందర్భంగా.. కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు.. హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్ ఫాంహౌజ్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెప్పినప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# నేడు కోనసీమకు ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలో పర్యటించనున్నారు. గ్రౌండ్ రెంట్ భూములకు 22ఏ నుంచి విముక్తి కల్పించిన నేపథ్యంలో లబ్ధిదారులతో సమావేశమవుతారు. నేరుగా వారి నివాసాలకే వెళ్లి ప్రభుత్వ నిర్ణయం గురించి వారికి తెలియజేస్తారు. మాచవరం పంచాయతీ పరిధిలోని జయంతినగర్‌లో రైతులను కలసి



# మద్యం అమ్మకాలపై 'ఏఐ' నిఘా!

- షాపుల్లోని సీసీ కెమెరాలతో అనుసంధానం
- పనివేళలు, సీసాల స్కానింగ్‌పై పరిశీలన
- ఉల్లంఘనలపై అధికారులకు సమాచారం
- వచ్చే నెల నుంచి కొత్త పాలసీ అమలు




మద్యం అమ్మకాల విషయంలో కృత్రిమ మేధ (ఏఐ)ను విస్తృతంగా వినియోగించే దిశగా ఎక్సైజ్ శాఖ చర్యలు చేపడుతోంది. మద్యం దుకాణాల్లోని సీసీ కెమెరాలకు ఏఐతో అనుసంధానం చేయనుంది. షాపుల పనివేళలు, అమ్మకాలపై

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## సోషల్ మీడియాను యాక్టివ్ గా వాడాలి

## టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం



తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు.

# కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే



ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ. 32కే రాయితీపై

- సామాన్యులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు
- కిలో ఉల్లిపాయలు రాయితీపై రూ.32కే అందించాలని నిర్ణయం
- వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో విక్రయాలు
- చౌకడిపోల్లో కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి
- బహిరంగ మార్కెట్ కన్నా 30 శాతం తక్కువ ధరకే సరుకులు

# తెలంగాణ మండలిలో హైటెన్షన్..

- తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత
- మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ తాతా మధును అడ్డుకున్న మార్షల్స్
- వెళ్లేందుకు నిరాకరించడంతో బలవంతంగా ఎత్తుకెళ్లి బయటకు తరలింపు
- స్పీకర్‌పై వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకున్న అధికారులు



తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును మార్షల్స్ బలవంతంగా ప్రాంగణం వెలుపలికి తరలించారు. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలి ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకు ఎమ్మెల్సీ తాతా మధు ప్రయత్నించారు.

# ఉత్తరాంధ్రలో వైసీపీకి భారీ షాక్

2018లో జగన్ ఆహ్వానంతో వైసీపీలో చేరింది. జగన్ పాదయాత్రలో చిన్నశ్రీను ఉత్తరాంధ్రలో అన్నీతానై వ్యవహరించారు. 2021 జడ్పీ ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో ఆయన చైర్మన్‌గా నియమితులయ్యారు. చిన్న శ్రీను చేపట్టిన తొలి అధికారిక పదవి ఇదే. ఈ నెల 24తో పదవీకాలం ముగియనుంది. బుధవారం జడ్పీ సమావేశం ఉందనగా ఆయన రాజీనామా చేయడం విశేషం. బొత్సతో విభేదించి ఆయనీ నిర్ణయం తీసుకున్నారా.. లేకుంటే ఆయన కంటే ముందే వైసీపీ నుంచి బయటకు రావాలని భావించారా అనేది తెలియరాలేదు. ఎందుకంటే గత కొంతకాలంగా బొత్స కుటుంబం మొత్తం వైసీపీకి గుడ్‌బై చెబుతుందన్న ప్రచారం నడుస్తోంది. ఆయన దీనిని ఖండించకపోవడంతో అనుమానాలు పెరుగుతున్నాయి. ఇంతలోనే చిన్నశ్రీను టీడీపీలో చేరి ట్విస్టు ఇచ్చారు.

**కుమార్తె కోసమే నిర్ణయం?** ఇంకోవైపు.. వైసీపీకి చిన్న శ్రీను గుడ్‌బై చెప్పడానికి తగిన కారణమే ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇటీవల బొత్స తన కుమార్తె అనూష విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ రేసులో ఉంటారని ప్రకటించారు. అయితే అప్పటికే ఈ పదవికి తన కుమార్తె సిరిసహస్రను నిలబెట్టాలని నిర్ణయించుకున్న చిన్నశ్రీను.. తనకు మాటమాత్రంగానైనా చెప్పకుండా బొత్స ప్రకటించే సరికి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు చెబుతున్నారు. అందుకే రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. బలంగా ఉన్న బొత్స కుటుంబంలో చీలిక వచ్చిందన్న ప్రచారం జిల్లాలో కొంత బలంగానే ఉంది. నెల్లిమర్ల నియోజకవర్గంలో 2019లో బడ్డుకొండ అప్పలనాయుడు గెలిచారు. ఈయన చిన్నశ్రీనుకు స్వయానా సోదరి భర్త. కానీ నియోజకవర్గంలో బొత్స మరో సోదరుడు లక్ష్మణరావు జోక్యం చేసుకునేవారు. 2024 ఎన్నికలకు ముందు ఇక్కడ వైసీపీ టికెట్ విషయంలో పంచాయితీ నడిచింది. లక్ష్మణరావు కోసం బొత్స ప్రయత్నించినప్పటికీ అప్పలనాయుడికే మళ్లీ దక్కింది. దీంతో లక్ష్మణరావు పరోక్షంగా అప్పలనాయుడి ఓటమికి కృషిచేశారనే ప్రచారం జరిగింది.

**ముహూర్తం కుదిరింది.. రంగుమారింది!** చిన్నశ్రీను రాత్రి ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో చర్చించిన అనంతరం టీడీపీలో చేరారు. ఆయనతోపాటు ఆయన కుమార్తె సిరిసహస్రకూ చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రులు కళావెంకట్రావు, కొండ్రు మురళి, సుజయ్‌కృష్ణ రంగారావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యేలు కోళ్లలలిత కుమారి, అదితి, బేబినాయన తదితరులు పాల్గొన్నారు. చిన్న శ్రీనును టీడీపీలోకి తీసుకురావడంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీశ్ క్రియాశీల పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. మంగళవారం తర్వాత మంచిరోజులు లేవన్న ఉద్దేశంతోనే చిన్నశ్రీను, సిరిసహస్ర వైసీపీని వీడి హడావుడిగా టీడీపీలో చేరినట్లు సమాచారం. వీరిద్దరూ ఉండవల్లిలో టీడీపీలో చేరుతున్న సమయంలోనే.. విజయనగరం ధర్మపురిలోని చిన్నశ్రీను స్వగృహం వద్ద కార్యకర్తలు వైసీపీ ఫ్లెక్సీలు తొలగించడం గమనార్హం.

**బొత్సతో విభేదాల్లేవు: చిన్నశ్రీను** చంద్రబాబు పాలన నచ్చడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వామినయ్యేందుకు, తాను టీడీపీలో చేరానని చిన్న శ్రీను అన్నారు. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు మరింత అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో తాను చంద్రబాబు, యువనేత లోకేశ్ పాలనకు మద్దతివ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బొత్స సత్యనారాయణతో తనకు ఎలాంటి విభేదాలూ లేవన్నారు. ఒక కార్యకర్తగా టీడీపీలో చేరానని..

పదవుల కోసం కాదని చెప్పారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తన రాకను టీడీపీ నాయకులు కూడా స్వాగతించారని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ఐక్యంగా సాగాలి

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నందిపత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగే వ్యూహాత్మక ప్రయత్నాలు ముమ్మరంగ్ చేయాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో లీడర్ షిప్ కాంక్లేవ్ నాయకత్వ శిక్షణా తరగతులు రెండోరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సౌజన్యంలో నిర్వహించిన సమావేశంలో తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకత్వ శిక్షణా తరగతులు రెండో రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై వివరించారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండాలని నిరంతరం ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని వక్తలు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అని రంగాల్లో ముందుకు నడిపేందుకు ఈ శిక్షణ తరగతులు చాలా ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సమర్థవంతమైన ప్రజా బలం ఉన్న నాయకులుకు కూటమిలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్ నాయకులు ప్రజా ప్రతినిధులు తో కలిసి అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహం గా ప్రజాక్షేత్రంలో ముందుకు సాగేందుకు ఈ శిక్షణ తరగతులు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలకు ఇంచార్జీలను నియమించినట్లు స్పష్టం చేశారు. పోలవరం జిల్లాకు ఇంచార్జి గా నియమించిన కుడిపూడి సత్తిబాబు సూచనలు సలహాలతో పోలవరం జిల్లాలో స్థానిక సమరంలో విజయ ఢంకా మోగిస్తామన్నారు. పోలవరం జిల్లా అభివృద్ధికి తెదేపా నిర్ణయాలతోనే సరికొత్త సుస్థిరాభివృద్ధి రాబోతుందని అశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల పోలవరం జిల్లా ఇంచార్జి కుడిపూడి సత్తిబాబు, పొలిట్ బ్యూరో సభ్యులు , మంత్రులు , ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హత్యకు కుట్ర..

తమ నాయకుడిని తామే కాపాడుకోవాలి అంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని జవహర్‌నగర్, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై దృష్టి పెట్టిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకునే వరకు, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల తీరుపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించడానికే సభను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఒక రోజు రాజకీయ విమర్శలకు కేటాయించి, మిగిలిన సమయాన్ని ప్రజా సమస్యలపై చర్చించేందుకు వినియోగించాలని సూచించారు. దళితులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. దళితబంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటివరకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్‌తో మేడ్చల్ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్? చేస్తున్నారని మాజీమంత్రి హరీశ్?రావు విమర్శించారు. సభలో సమస్యలు చర్చించకుండా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికితే రేవంత్ రెడ్డికి కనపడలేదని, మహిళ ఎమ్మెల్యేలు ఫిర్యాదు ఇస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు ఏమనుకుంటారోనన్న జ్ఞానం లేదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కౌరవులకు పట్టిన గతి కాంగ్రెస్?కు పడుతుందని హరీశ్? వ్యాఖ్యానించారు. బీజేపీ సభ్యులు ప్లకార్డులతో అసెంబ్లీలోకి వెళ్లారన్న హరీశ్?, దీన్నిబట్టే బడే భాయ్ చోటే భాయ్ బంధం అర్థం అవుతోందన్నారు. సీఎం చేతకాని తనం వల్ల క్రాప్? హాలిడే ఇచ్చే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టంచేశారు. ఎవరిది అసభ్యకర భాష, ఎవరిది వికృత భాష అని ప్రజలు గమనిస్తున్నారు. కేసీఆర్ ఇంటి మీద ముఖ్యమంత్రి దాడికి ఉసిగొల్పారు. దీనిపై కేంద్రం జోక్యం చేసుకోవాలి. రేవంత్ రెడ్డి ఎప్పుడూ కేసీఆర్ చావును కోరుకుంటారు. ఎమ్మెల్యేల చేత కేసీఆర్ చావాలని మాట్లాడిస్తున్నారు. రేవంత్ రెడ్డి అండతోనే ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్?పై మాట్లాడారు. శంకర్?పై కేసుపెట్టాలి, సభ్యత్వం రద్దు చేయాలని అన్నారు. కాగా బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి భారీగా చేరుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా రావడంతో ఇరు వర్గాల మధ్య నినాదాలు, వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఇరువర్గాలు రాళ్లు, కుర్చీలు విసురుకోవడంతో ఆ ప్రాంతం అంతా రణరంగంగా మారిపోయింది. పరిస్థితి అదుపు తప్పడంతో కొందరు కార్యకర్తలు కుర్చీలు, రాళ్లు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ కార్యకర్తలు ముందుకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోగా, పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. రాళ్లు, కుర్చీలతో పరస్పరం దాడులు జరిగినట్లు ప్రత్యక్షంగా ఉన్నవారు చెబుతున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఘర్షణలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని.. చేయి విరిగినట్లు సమాచారం. అయితే గాయాలపై పూర్తి వివరాలు, ఘటనకు సంబంధించిన కారణాలపై అధికారికంగా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. అతి కష్టం మీద ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ ఘటనల నేపథ్యంలో బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ సహా బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. తమ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ నేతలకు కూడా రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు..

వచ్చినందుకు గుర్తుగా పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ స్థాయిలో 53 దీపాలు వెలిగించి, ఆ రోజును 'బ్లాక్ డే'గా పాటించాలని ఆయన శ్రేణులకు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో లోకేశ్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. కార్యకర్తల పోరాటాలు, త్యాగాల పునాదులపైనే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని స్పష్టం చేశారు. "ఒక తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజుల వంటి కార్యకర్తలపై గత ప్రభుత్వం దాడులు చేసింది. కొందరిని హతమార్చింది. వారి త్యాగాల వల్లే మనం ఇవాళ నాయకులుగా ఉన్నాం. ఈ విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు" అని ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. నాయకులకు శిక్షణ ఇచ్చేందుకు, ప్రజలకు మరింత చేరువయ్యే వ్యూహాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి ఇలాంటి కాంక్లేవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

**నేతలకు 'త్రీ-పీ' మంత్రం** నాయకులంతా మూడు 'పీ'ల (పార్టీ, పర్సనల్, ప్రభుత్వం) సూత్రాన్ని తప్పక పాటించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగతంగా (పర్సనల్) ప్రజలకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, మానవత్వం, అణకువతో వ్యవహరించాలని హితవు పలికారు. "ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రధాని మోదీ గారి నుంచి నేను ఈ విషయం నేర్చుకున్నాను. ఆయన నా నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. మనం కూడా విమర్శలను స్వీకరించి మార్పు చేసుకోవాలి" అని అన్నారు.రెండో 'పీ' అయిన పార్టీ విషయంలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలని, అలకబూనిన వారిని దగ్గరకు తీసుకోవాలని సూచించారు. ఇక మూడో 'పీ' అయిన ప్రభుత్వం గురించి మాట్లాడుతూ.. నేతలు కేవలం పోస్ట్ ఆఫీసుల్లా కాకుండా, తమ నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపే లీడర్లలా వ్యవహరించాలని కోరారు. పాఠశాలలు, ఆసుపత్రులను తనిఖీ చేస్తూ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు.

**వైసీపీ దుష్ప్రచారంపై ఐక్య పోరాటం** వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఐక్యంగా తిప్పికొట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. డీఎస్సీపై మేం చిత్తశుద్ధితో 16 వేల పోస్టులు భర్తీ చేశాం. ఈ ఐదేళ్లలో 30 వేల పోస్టులు భర్తీ చేస్తాం. పోలీస్ నియామకాల్లోనూ అంతే. అయినా మనపైనే విమర్శలు చేస్తున్నారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలి" అని అన్నారు. సొంత బాబాయి హత్య కేసు, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడని జగన్.. కేవలం డీఎస్సీపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వెర్షన్ అని, 'నో ఇగో, ఓన్లీ సర్వీస్' అనే నినాదంతో పనిచేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. "పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ కట్టుబడి ఉండాలి. అహంకారం వద్దు, కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం" అని ఆయన ముగించారు. తన ఎదుగుదలకు కారణం కార్యకర్తల సహకారమేనని లోకేశ్ పేర్కొన్నారు.

## మద్యం అమ్మకాలపై 'ఏఐ' నిఘా!

నిఘా పెట్టనుంది. వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్న కొత్త మద్యం పాలసీలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ప్రతి మద్యం షాపులోనూ సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని ఎక్సైజ్ కార్యాలయంలో ర్యాండమ్‌గా పరిశీలిస్తుంటారు. ఒకేసారి అన్ని కెమెరాలను పరిశీలించడం సాధ్యం కానందున, కొన్నిసార్లు షాపుల్లో తప్పులు జరిగినా అవి అధికారులకు తెలియట్లేదు. కొత్తగా సీసీ కెమెరాలకు ఏఐని అనుసంధానం చేయడం వల్ల ఎక్కడైనా తప్పులు చేస్తే.. ఏఐ వాటిని వెంటనే గుర్తించి, ఆ సమాచారాన్ని అధికారులకు పంపుతుంది. ఉదాహరణకు నిర్దేశిత సమయం దాటిన తర్వాత కూడా షాపులు మూయకపోయినా, ముందే తెరిచినా ఏఐ అధికారులకు తెలుపుతుంది. అలాగే మద్యం సీసాలను స్కాన్ చేయడాన్ని వచ్చే పాలసీ నుంచి తప్పనిసరి చేస్తున్నారు. కొత్త పాలసీ ప్రకారం.. సీసాలను స్కాన్ చేస్తున్నారా? లేదా? అనేది కూడా ఏఐ గుర్తిస్తుంది. ఎక్కడైనా షాపులో ఉల్లంఘన జరిగితే అధికారులకు సమాచారం పంపుతుంది. మద్యం షాపుల్లో జరిగే అన్ని రకాల ఉల్లంఘనలనూ ఏఐ ద్వారా గుర్తించేలా టెక్నాలజీ రూపొందిస్తున్నారు.

## కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే:

అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు.వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

## ఎల్‌నినో స్పీడ్ బ్రేకర్ లాగా వచ్చింది.. చంద్రబాబు నాయకత్వంలో ఎదుర్కొంటాం

తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని, అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం, చిత్తూరులో 65 శాతం, విశాఖపట్నంలో 60 శాతం వర్షపాతం లోటు ఉందని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలోని 680 మండలాల్లో వర్షాలు లేక కరవు ఛాయలు అలుముకున్నాయని తెలిపారు. అయితే, ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి గత ఏడాదే చెరువులను నింపడం వంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ఈ కష్టకాలంలో కొందరు 'గొడ్డలి పార్టీ' నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. గతంలో పట్టిసీమను వ్యతిరేకించి, ఐదేళ్ల పాటు ఉచిత పంటల బీమా అని చెప్పి కనీసం ప్రీమియం కూడా చెల్లించని వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 46 లక్షల మంది రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించిందని, ఇప్పటికే రూ.4,800 కోట్లు బీమా చేశామని స్పష్టం చేశారు. 27 నెలల క్రితం అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబు మళ్లీ గాడిన పెట్టారని అచ్చెన్నాయుడు కొనియాడారు.గతంలో రాజమండ్రి సూపర్ సైక్లోన్, శ్రీకాకుళంలో తితిలి తుపాను వంటి భయంకరమైన విపత్తులను చంద్రబాబు సమర్థంగా ఎదుర్కొన్నారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. 30 ఏళ్ల క్రితమే నీటి సమస్యపై ఆయన దృష్టి సారించారని, 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టులపై రూ.65 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు వాస్తవాలు గ్రహించి రైతులకు ధైర్యం చెప్పాలని ఆయన సూచించారు.

## తెలంగాణ మండలిలో హైటెన్షన్..

అయితే, ఆయనపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడినందున, మండలి ఆవరణలో మాట్లాడేందుకు అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు. అయినప్పటికీ, అధికారుల సూచనను తిరస్కరించిన తాతా మధు, అక్కడే ఉండేందుకు ప్రయత్నించారు. దీంతో మార్షల్స్ రంగప్రవేశం చేసి, ఆయన్ను బలవంతంగా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఆయన నిరాకరించడంతో, మార్షల్స్ ఆయనను చేతులపై ఎత్తుకుని ప్రాంగణం వెలుపలికి తీసుకెళ్లారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తాతా మధుపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, మండలి ప్రాంగణంలో ఆయనను మాట్లాడకుండా అధికారులు అడ్డుకున్నారు.

## అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది

టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

## నేడు కోనసీమకు ముఖ్యమంత్రి

ముచ్చటిస్తారు. వారికి పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందజేస్తారు. అనంతరం మాచవరం పండువారిపేటలో ప్రజావేదిక బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షిస్తున్నారు.

# నంద్యాలలో జర్నలిస్టుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి. కాంగ్రెస్ పార్టీ డిమాండ్.

**అర్ధరాత్రి దొంగలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు అరెస్టును ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి.**

**అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలి.**

**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 08 . (నంది పత్రిక ):** నంద్యాల జిల్లాలో ఐ న్యూస్ రిపోర్టర్స్ ని అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్లి దొంగలను అరెస్టు చేసినట్లుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, , జిల్లా ఉపాధ్యక్షుడు సలాం,కుమార్ పుష్పరాజు నంద్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో మంత్రి ఫరూక్ కుమారుల మీద షాడో మంత్రులు అంటూ వార్తలు ప్రసారం చేసారని అనుచరులు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి సమయంలో ఉగ్రవాదులను,దొంగలను అరెస్ట్ చేసినట్లుగా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురయ్యే విధంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా ప్రతినిధులను పూర్తిగా ఇబ్బందులు గురి చేసే విధంగా పోలీస్ చర్యలను వారు తప్పు పట్టారు పత్రికా స్వేచ్ఛను మీడియా స్వేచ్ఛను హరించే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఏమైనా తప్పుడు కథనాలని ప్రసారం చేస్తే ప్రజాస్వామ్య బద్ధంగా డెఫినేషన్ వేయొచ్చు కానీ వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ కుమారులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు ఇస్తే.. న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి అక్రమ కేసులు పెట్టి జర్నలిస్టులను లొంగదీసుకోవాలని చూస్తే అది కుదరదని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.నంద్యాల టూ టౌన్ పోలీసులు దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, రిపోర్టర్స్ పై బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. అంతటితో ఆగకుండా రిపోర్టర్స్ పై నాన్ బెయిల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. రిపోర్టర్ల పై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టులందరిని కలుపుకొని ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.ప్రభుత్వానికి ప్రజలకు వాడిదిగా నిలిచే మీడియాపై కక్షకట్టడం అనైతికం తక్షణమే అరక్షేసిన మీడియా ప్రతినిధులను ప్రభుత్వం విడుదల చేయాలని వారిపై పెట్టిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నారు.



# ఖాజీపేట పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమం




**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 08** ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ ఆరవ ఇళయరాణి, డాక్టర్ ఎస్. ముబీన్ ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, ప్రజలకు అందించే వైద్య సేవలు, ఆశా కార్యకర్తల బాధ్యతలపై అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 11 నుంచి 24 వరకు నిర్వహించే లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులందరినీ పరీక్షించాలని సూచించారు. అలాగే పోషకాహార లోపం నివారణలో మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. గర్భధారణ 270 రోజులు, బిడ్డ పుట్టిన తర్వాత మొదటి సంవత్సరం 365 రోజులు, రెండో సంవత్సరం 365 రోజులు కలిపి తొలి 1000 రోజుల్లో తల్లి, శిశువు పోషణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి. నాగభూషణం, డిప్యూటీ ప్యారామెడికల్ ఆఫీసర్ ఎం. సురేష్ కుమార్, సూపర్‌వైజర్ ఏ. శోభన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కడప జిల్లా టీడీపీ నేతలతో మంత్రి సవితమ్మ ఆత్మీయ సమావేశం



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 08** విజయవాడలోని జయభేరి క్లబ్‌హౌస్‌లో కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులతో ఆత్మీయ విందు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జోనల్ కో–ఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవితమ్మ సూచించారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు తక్షణమే ఎత్తివేయాలి .

**నోటీసులు లేకుండా అర్ధరాత్రి ఐన్యూస్ రిపోర్టర్ల అరెస్టు దారుణం.**

**సిపిఐ జిల్లా కార్యదర్శి రంగ నాయుడు .**



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 08 . (నంది పత్రిక ):** నంద్యాల పట్టణంలో ఐన్యూస్ జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగా నాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. ముందస్తు నోటీసులు లేకుండా సురేష్ కుమార్, నాగ చంద్రుడులను అర్ధరాత్రి వేళ దొంగల మాదిరిగా ఇళ్లకు వెళ్లి అరెస్టు చేయడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఖండించారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలోనే పత్రికా స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుంటే బాధితులకు న్యాయం జరిగేనా అని ప్రశ్నించారు. మంత్రి కుమారులు భూముల ఆక్రమణలు, మట్టి తవ్వకాల అక్రమాలకు పాల్పడుతున్నారనే వార్తలపై కక్షసాధింపుతోనే ఈ కేసులు పెట్టారన్నారు. కథనాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధంగా నోటీసులు ఇవ్వాలి తప్ప, వార్తలు వెనక్కి తీసుకోవాలని బెదిరించడం సరికాదన్నారు. మాట వినకపోవడంతో టూటౌన్ పోలీసులు నాన్–బెయిలబుల్ కేసులు బనాయించి దౌర్జన్యానికి దిగారని మండిపడ్డారు. ఐన్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజుతో పాటు ఇతర విలేకరులను బెదిరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. తక్షణమే అక్రమ కేసులను ఉపసంహరించుకోకపోతే జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామ్యవాదులతో కలసి సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మండలానికి త్రాగు సాగు నీరు అందించాలి.

**-రైతు, ప్రజల సమస్యలను పరిష్కరించాలి.**

**-మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి.**

**-తహసీల్దార్ కార్యాలయం ముందు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన**



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండలంలోని ప్రజలకు తాగునీరు, రైతుల పొలాలకు సాగునీరు అందించేలా అధికారులు చొరవచూపి చర్యలు తీసుకోవాలని జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ భాషలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు వైఎస్సార్సీసీ శ్రేణులతో కలసి ఆందోళన చేపట్టి తహసీల్దార్ ఉమారాణికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంగమేశ్వరం ఎత్తిపోతల నుంచి రైతుల పొలాలకు సాగునీరు ఇవ్వాలని, అదేవిధంగా శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం చెరువులను నింపి తాగునీరు అందించాలన్నారు. మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు. ఎల్నినో ప్రభావం వల్ల చాలా తక్కువ వర్షపాతం క్షీణించిందన్నారు. దీంతో రైతులు నష్టపోయారన్నారు. కొత్తపల్లి మండలమును కరువు మండలముగా ప్రకటించి త్రాగునీరు, సాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. రైతులందరికీ క్రాప్ ఇన్సూరెన్సు వచ్చే విధంగా చూడాలన్నారు. సిద్ధాపురం చెరువు నుండి ఇందిరేశ్వరం చెరువు వరకు లిఫ్ట్ ఏర్పాటుకు, ప్రభుత్యము ఉత్తర్వులు ఇచ్చిందని, అదే లిస్టు, వీఆర్ఎస్సీ డివిజన్ వరకు పొడిగించి కొత్తపల్లి, వీరాపురం, బాబాపురం, లింగాపురం, దుద్యాల గోకవరం, నందికుంట ప్రాంత రైతుల పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పింఛన్ ధరఖాస్తులో ఎలాంటి వివక్ష లేకుండ అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. మహిళలకు నెలకు రూ.15 వందలు.నిరుద్యోగులకు భృతి క్రింద రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మునిరంగ, రామిరెడ్డి, రమేష్ బాబు, రవీంద్రారెడ్డి కృష్ణుడు, అయ్యపురెడ్డి, లోకేశ్వర రెడ్డి, బాబు రెడ్డి, ఉస్మాన్ బాషా, నాగేశ్వర రెడ్డి, చంద్రమౌళి. రామలింగారెడ్డి, అచ్చిరెడ్డి, లింగారెడ్డి, దాసు, ప్రతాప్ రెడ్డి, రాజ్ కుమార్ మరియు రైతులు పాల్గొన్నారు.



# 98 జీవోను అమలు చేయాలి.




**కొత్తపల్లి – నంది పత్రిక:** శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం కోసం ఏర్పాటు చేసిన 98 జీవోను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని నీటి మంపు నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు జయన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక స్వర్ణగ్రామ కార్యాలయం నందు ఆర్డీఓ వెంకటశివ, తహసీల్దార్ ఉమారాణిలకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ముంపు భాదితులు తమ హక్కు అయిన జీవో 98 అమలు కోసం నందికొట్కూరు పట్టణంలో 167 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సిగ్గు చేటు అన్నారు. అందువల్ల ఉద్యమాన్ని తీవ్రస్థాయిలో చేయుటకు మండలాల వారీగా ఆయా మండల తహశిల్దార్లకు తమ సమస్యను పరిష్కరించడానికి కృషి చెయ్యాలని కోరుతూ వినతి పత్రాలు ఇచ్చామన్నారు. స్పందించిన ఆర్డీఓ, తహసీల్దార్లు నీటి ముంపు నిరుద్యోగుల సమస్యను వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, కులవివక్ష వ్యతిరేఖ పోరాట సమితి సంఘం అధ్యక్షుడు సంపత్, సీనియర్ నీటి ముంపు నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు గుంపుల వెంకటేశ్వర్లు. సీపీఎం మండల అధ్యక్షుడు నక్కా స్వాములు, నీటి ముంపు భాదితులు రాముడు, వెంకటేశ్వర్లు, నాగన్న శ్రీనివాసులు, ధర్మరాజు సాంభశివుడు, బొల్లు ప్రసాద్ బాబులు పాల్గొన్నారు.

# రీ సర్వేను త్వరగా పూర్తి చేయండి

**-రైతులకు సమస్యలు లేకుండా రీ సర్వే చేయాలి.**

**-పింఛన్ దరఖాస్తుదారులను వెనక్కి పంపొద్దు**

**- ఆర్టిఓ వెంకట శివ**



**కొత్తపల్లి – నంది పత్రిక :** గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేలను త్వరగా పూర్తి చేయాలని రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయరాదని ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి వెంకట శివ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని రైతులు పొలాల్లో కీ సర్వే పనులపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయన్నారు. రీ సర్వేలో సమస్యలు ఉన్నట్లయితే రైతుల సమన్వయంతో పరిష్కారం చేయాలి అన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చేయాలన్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్లో కొత్తపల్లి మండలం చాలా వెనుకపడడం సిగ్గుచేటు. అన్నారు. పది రోజుల్లో రీ సర్వే పనులు పూర్తిచేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విఆర్వోలు, సర్వేర్లు ప్రత్యేక దృష్టి పెట్టి రిసర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని. హెచ్చరించారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 16వ తేదీ వరకు అవకాశం కల్పించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పెన్షన్ దారులు వస్తే ఎటువంటి.. పరిస్థితుల్లోనైనా ఎవరిని వెనక్కి పంపొద్దని ఆదేశించారు. అర్హులైన ప్రతి పెన్షన్ దారుడికి పెన్షన్ అందించేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు. దరఖాస్తులు పరిశీలన చేసి దరఖాస్తుకు తక్కువ ఏమైనా ఉంటే సంబంధిత అధికారి వివరించి దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. చెంచు గూడెంలలోని చెంచు గిరిజనులకు ఆధార్ కార్డు సమస్య ఉంటే తహసిల్దార్ పరిశీలన చేసి ఆర్టీవోకి పంపించాలన్నారు. అనంతరం స్వర్ణ గ్రామ కార్యాలయంలో రిజిస్టర్లను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, డిప్యూటీ ఎంపీడీవో శర్మ, వీఆర్వోలు స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



# బదిలీ అయిన ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు



**మద్రిపాడు సెప్టెంబర్ 08 నంది పత్రిక :** మద్రిపాడు మండలం కంపసముద్రం ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో తొమ్మిదేళ్లకు పైగా ఎంతో నిబద్ధత,అంకితభావంతో సేవలందించిన ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్ భాష బదిలీపై నాగినేనిగుంట ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు.ఈ సందర్భంగా విద్యార్థులు,తల్లిదండ్రులు,గ్రామస్తులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు.వీరు విధులు నిర్వహించిన కాలంలో విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు.క్రమశిక్షణ, విలువలను నేర్పుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేశారు.సౌమ్య స్వభావం,ఆత్మీయతతో విద్యార్థులు,తల్లిదండ్రులు,గ్రామస్తుల అభిమానాన్ని ఎంతగానో చూరగొన్నారు.బదిలీ సందర్భంగా గ్రామస్తులు మేళతాళాలతో ఆయనను ఊరేగింపుగా తీసుకెళ్లి పూలమాలలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు బదిలీ కావచ్చు,కానీ వారు బోధించిన పాఠాలు,తీర్చిదిద్దిన విద్యార్థులు,సంపాదించిన అభిమానం ఎప్పటికీ బదిలీ కావని,కంపసముద్రం పాఠశాలలో మస్తాన్ భాష అందించిన సేవలు విద్యార్థులు,గ్రామస్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఘనంగా కొనియాడారు.



# 108 వాహనంలో ప్రసవం...

**చాగలమర్రి సెప్టెంబర్ 8 నంది పత్రిక** మండల పరిధిలోని ఒంటి గుడిసె తాండాకు చెందిన రేణుక భాయ్ అను నిండు గర్భిణీ ప్రసవ నొప్పులు రాగా మంగళవారం 108 వాహనంలో ఓ జి తండా నుంచి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యలో ఆడబిడ్డను ప్రసవించింది. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి వెంకటేశ్వర్ రెడ్డి, పైలెట్ బ్రహ్మానంద రెడ్డి లు ఇంత జాగ్రత్తగా బిడ్డను అప్పగించడం జరిగింది. సురక్షితంగా వాహనంలో చేర్చినందుకు సిబ్బందిని పలువురు అభినందించారు.



నంది పత్రిక

బుధవారం 09 - 09 -2026

# జడ్పీటీసీ ల గౌరవవేతనశీ విడుదల



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 8 :(నంది పత్రిక ):**రాష్ట్రంలో ఉన్న జడ్పీటీసీలకు దాదాపు 48 48 నెలలకు సంబంధించిన గౌరవ వేతనాలు రావాల్సి ఉండగా ప్రభుత్వం స్పందించక పోవదంతో వైయస్సార్ కడప జిల్లా పరిషత్తు మెంబర్ అయిన పోరుమామిళ్ల జడ్పిటిసి ముత్యాల ప్రసాద్ హైకోర్టును ఆశ్రయించడం అయినది కోర్టు ఆరువారాలలో జడ్పిటిసిల గౌరవ వేతంగము చెల్లించవలసిన చెల్లించవలయునని తెలుపగా ప్రభుత్వము ఆరువారాల గడువులో పల గౌరవ వేతనం గురించి ప్రస్తావించక పోవడంతో ముత్యాల ప్రసాదు పోరుమామిళ్ల జడ్పిటిసి హైకోర్టులో 50 మంది జడ్పీటీసీ లు మరియు ఇద్దరు కోప్షన్ మెంబర్లు కలిపి కంటెంట్ వేయడం వలన వెంటనే స్పందించిన పంచాయతీరాజ్ కమిషనర్ వెలగపూడి విజయవాడ వారు వైయస్సార్ కడప జిల్లా పరిషత్ జడ్పిటిసి లకు సంబంధించిన గౌరవ వేతనము జిల్లా పరిషత్ జనరల్ ఫ ండ్ నుండి మంజూరు చేయవలసినదిగా ఉత్తర్వులు జారీ చేసినారు ఆ మేరకు వైయస్సార్ కడప జిల్లా పరిషత్ 50 మంది జడ్పిటిసి లకు మరియు కోఆప్షన్ నెంబర్లు ఇద్దరికీ కలిపి ఒక్కొక్కరికి రెండు లక్షల 55 98 రూపాయల ప్రకారం మొత్తం కోటి 46 లక్షల 89 వేల 98 రూపాయలు మొత్తం వారి బ్యాంకు ఖాతాలలో జమ చేయమని సమాచారము ఇవ్వడం జరిగింది జిల్లా పరిషత్తు ద్వారా పంపడం కూడా జరిగినది హైకోర్టును ఆశ్రయించడానికి తోడ్పడిన చక్రాయపేట జడ్పిటిసి శివప్రసాద్ రెడ్డి వేంపల్లి జెడ్పిటిసి రవికుమార్ రవికుమార్ రెడ్డికి మరియు హైకోర్టులో జడ్పిటిసిల తరఫున పోరాడిన సీనియర్ హైకోర్టు లాయర్ జడ శ్రావణ్ కుమార్ కి పోరుమామిళ్ల జడ్పిటిసి ముత్యాల ప్రసాదు కృతజ్ఞతలు తెలపడం అయినది.

# తొట్టిగారిపల్లి పీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర డిస్ట్రిక్ట్ అసెస్‌మెంట్



**బద్వేల్, సెప్టెంబరు 8 ( నంది పత్రిక )**బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ట్ అసెస్‌మెంట్ బృందం సభ్యులు సందర్శించి పరిశీలించారు. అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా చేపడుతున్న సర్వే, మాతా శిశు సంరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. హోమ్ బేస్డ్ నియోనేటల్ కేర్ కిట్ ప్రాముఖ్యతను ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి వివరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. చంద్రావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సులోచన, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# పోరుమామిళ్లలో బజాజ్ కొత్త బైకుల లాంచింగ్



**పోరుమామిళ్ల , సెప్టెంబర్8 (నంది పత్రిక):** కడప జిల్లా బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల పట్టణంలో బజాజ్ షోరూమ్‌లో కొత్త బైకుల లాంచింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.బజాజ్ షోరూమ్ యజమాని రవీంద్రబాబు ఆహ్వానం మేరకు రంగసముద్రం ఎంపీటీసీ కల్వకూరి రమణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మార్కెట్లోకి కొత్తగా వచ్చిన పల్సర్ 125, పల్సర్ 150, పల్సర్ ఎన్ , పల్సర్ ఎన్ ఎస్ ఎస్ మోడళ్లను ఎంపీటీసీ కల్వకూరి రమణ చేతుల మీదుగా లాంచ్ చేశారు.అనంతరం షోరూమ్‌లో కేక్ కట్ చేసి, కొత్త బైకులను మార్కెట్లోకి తీసుకువచ్చిన షోరూమ్ యజమాని రవీంద్రబాబుతో పాటు సిబ్బందికి ఎంపీటీసీ రమణ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కొత్త బైకులను పరిశీలించిన ఎంపీటీసీ రమణ, వాటి డిజైన్, లుక్, ఫీచర్లను అడిగి తెలుసుకున్నారు. యువతను ఆకట్టుకునే విధంగా బజాజ్ సంస్థ కొత్త మోడళ్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు.అదే సమయంలో యువతకు ఎంపీటీసీ రమణ కీలక సూచనలు చేశారు. కొత్త బైక్ కొనుగోలు చేయాలనే ఉత్సాహం యువతలో సహజంగానే ఉంటుందని, అయితే అదే ఉత్సాహంతో వాహనాలను వేగంగా నడపకుండా రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, వాహనాన్ని నియంత్రిత వేగంతో నడపడం వంటి జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. బైక్‌పై ప్రయాణించే సమయంలో తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎంపీటీసీ కల్వకూరి రమణ సూచించారు.ఈ లాంచింగ్ కార్యక్రమంలో షోరూమ్ స్టాఫ్‌తో పాటు కల్లూరు జయరాం రెడ్డి, చెరుకూరి కేశవ, నాయబ్, కరిముల్లా మురళి, అన్వర్, కిషోర్, చిన్న, అరుణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



**పోరుమామిళ్ల సెప్టెంబర్ 8 : ( నంది పత్రిక ):**ఓటర్ల జాబితా సవరణ, మ్యాపింగ్, అభ్యంతరాల స్వీకరణ తదితర ప్రక్రియలను పూర్తిచేసి, తుది ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 నాటి ఓటర్ల జాబితాలో మ్యాపింగ్‌కు సంబంధించి పలువురికి నోటీసులు జారీ చేయడం, విచారణకు హాజరు కాకపోతే ఓట్లు తొలగిస్తామని బెదిరింపులు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. రేషనలైజేషన్ పేరుతో పోలింగ్ బూత్‌లను ఇష్టారాజ్యంగా మారుస్తున్నారని, ఫారం–8 ద్వారా ఓటర్ల కుటుంబాలను వేర్వేరు పోలింగ్ బూత్‌లకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు.అధికార పార్టీకి అనుకూలంగా ఉండేలా పోలింగ్ బూత్‌ల మార్పులు జరుగుతున్నాయని, ఎన్నికల యంత్రాంగం అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేస్తోందనే ఆరోపణలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని నాగార్జున రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయి, తుది జాబితా ప్రకటించే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రక్రియపై అనేక సందేహాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్ర ఎన్నికల సంఘం తీరుపై ప్రజల్లో మరిన్ని అనుమానాలు పెరిగే అవకాశం ఉందని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పేర్కొన్నారు.

# జాతీయ కీటక జనిత వ్యాధులపై జాగ్రత్త వహించండి

### వైద్యాధి కారి ప్రశాంతి టి.నరసింహా రెడ్డి సబ్ - యూనిట్ ఆఫీసర్




**కాశినాయన సెప్టెంబర్ 8 ( నంది పత్రిక ):**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నరసాపురం నందు వైద్యాధికారి డా.ప్రశాంతి ఆధ్వర్యంలో ఆశా డే మీటింగ్ జరపడం జరిగింది. ఈ మీటింగ్ నందు వైద్యాధికారి గారు మాట్లాడుతూ అన్ని ఇండికేటర్స్ పైన రివ్యూ చేశారు, ఎం సి హెచ్ , ఈ హెచ్ ఆర్ , ఈసీ , లు అన్ని కూడా 100 % ప్రతి ఏ ఎన్ ఎం & ఎం ఎల్ హెచ్ పి లు సాధించాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి పోరుమామిళ్ల లో యే విధంగా అయితే రివ్యూ చేసారో,ప్రతి ఒక్కరిని కూడా అదే విధంగా రివ్యూ జరుగుతుంది అని, విలేజ్ హెల్త్ క్లినిక్ కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి గారు పర్యవేక్షణ ఉంటుందని, సిబ్బంది అందరు, మీ గ్రామాలల్లో అప్రమత్తం గా వుంటూ మీ విధులను సక్రమంగా నిర్వహించాలని డాక్టర్ ప్రశాంతి, వైద్య సిబ్బంది కి తెలియచేసారు,.ఈ నెల 11వ తేదీ నుంచి 24 వరకు జరిగే జాతీయ కుష్టు నిర్మూలనా కార్యక్రమం ప్రోగ్రామ్ హౌస్ శీ హౌస్ గృహాలు సర్వే నిర్వహించి ప్రతి రోజు రిపోర్ట్ పంపాలని తెలియచేసారు,మన పీ హెచ్ సి ని,ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి అందరూ కృషి చెయ్యాలని కోరటం జరిగింది. ఈ మీటింగ్ నందు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీ టి .నరసింహారెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని,మలేరియా, ఫైలేరియా,డెంగ్యూ,చికున్ గునియా, మెదడు వాపు జ్వరాల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని వివరించటం జరిగింది. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే తప్పకుండా ప్రతి ఇల్లు పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బంది తెలియచేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ , సుబ్బారాయుడు, పి హెచ్ ఎన్ , హుస్సేణమ్మ,సూపర్వైజర్ డా . బాలయ్య,నిర్మల హెచ్.ఏ ,చంద్రశేఖర్, ఎం ఎల్ హెచ్ పి 'లు , ఏ ఎన్ ఎం లు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీత హాజీ బాష కు సన్మానం



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 8:** నంద్యాల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన డాక్టర్ ఎం హాజీ భాషను బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ అబ్దుర్ రాఫీ, మండల విద్యాశాఖ అధికారిణి యశోద, ఉపాధ్యాయులు సిబ్బంది శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి ఆత్మకూరు ఆదర్శ పాఠశాలలో పిజిటి కెమిస్ట్రీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న హాజీ భాష విద్యా రంగానికి విద్యార్థుల అభ్యున్నతి కోసం పడుతున్న శ్రమను సేవలను గుర్తించి ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. హాజీ భాషకు ఈ అవార్డు రావడం మండల విద్యాశాఖ కి గర్వకారణం అని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వాయు కాలుష్యంపై కేంద్రం సర్వే..

దేశవ్యాప్తంగా తీవ్ర వాయు కాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకుల్లో ఆసక్తికరమైన ఫలితాన్ని సాధించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. తీవ్ర శీతాకాలపు పొగమంచు, విషపూరిత గాలి ఉన్నప్పటికీ.. బెంగళూరు (32వ ర్యాంక్), శ్రీనగర్ (26వ ర్యాంక్) వంటి నగరాలను ఢిల్లీ వెనక్కి నెట్టడం గమనార్హం. అయితే, ఈ ర్యాంకులు నగరాల్లోని గాలి నాణ్యతకు ప్రతిబింబం కాదు. కాలుష్య నియంత్రణకు నగరాలు తీసుకుంటున్న చర్యల ఆధారంగానే ఈ సర్వేను నిర్వహించారు.

ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో అగ్రస్థానంలో నిలవగా, ఇండోర్ రెండో స్థానంలో, జబల్‌పూర్ (195 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచాయి.

# రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గురుకుల పాఠశాలలో మహిళల భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన సిఐ రాజగోపాల్..




**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 8, క్రైమ్ న్యూస్, కడప జిల్లా** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ వారి ఆదేశాల మేరకు మహిళల భద్రత కార్యక్రమంలో భాగంగా రిమ్స్ పోలీస్ స్టేషన్ సిఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా ద్వారా మహిళలపై జరిగే నేరాలు, ఆన్లైన్ మోసాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో బాధ్యతగా వినియోగించాలని, రిక్వెస్టులు, మెసేజ్ లు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిగిడలు బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసుల ను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు బాలికల భద్రత పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షిత సమాజ నిర్మాణానికి సహకరించాలని సిఐ రాజగోపాల్ కోరారు

# ఆశ వర్కర్లు అవగాహన కల్పించాలి... డాక్టర్ ప్రత్యూష



**చాగలమర్రి సెప్టెంబర్ 8 నంది పత్రిక** అ క్రియేటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్ ( ఆశ ) కార్యకర్తలు ప్రజలకు పలు వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన కీలకమైన ఆరోగ్య వారదులుగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు డాక్టర్ ప్రత్యూష అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని సమావేశ భవనంలో ఆరోగ్య, ఆశా వర్కర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణలో భాగంగా పోషకాహారం వైద్య పరీక్షలు చేయించడం, సురక్షిత ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. రోగ నిరోధక టీకాలు, వ్యక్తిగత పరిసరాల పరిశు భ్రత పై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సేవలను సమన్వయపరిచే విధంగా ఉండాలన్నారు. వ్యాధుల నియంత్రణలో భాగంగా గ్రామీణ ప్రాంత ఆరోగ్య కమిటీలో సభ్యులుగా ఉంటూ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్వైజర్ రామలింగారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, హెల్త్ అసిస్టెంట్లు మనోహర్, ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లతో పాటు సి ఇ ఆర్ డి ఎస్ ఆళ్లగడ్డ బ్రాంచ్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించే ఏపీ సాక్స్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# నంద్యాలలో జర్నలిస్టుల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి.సిపిఎం డిమాండ్

## అర్ధరాత్రి దొంగలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు అరెస్టును ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి.

## అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలి




**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 08 . (నంది పత్రిక ):**నంద్యాల జిల్లాలో ఐ న్యూస్ రిపోర్టర్స్ ని అర్ధరాత్రి సమయంలో ఇంటికి వెళ్లి దొంగలను అరెస్టు చేసినట్లుగా పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా. నరసింహ, కె. మహమ్మద్ గౌస్, పి. వెంకట లింగం, డి. మౌలాలి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో మంత్రి ఫరూక్ కుమారుల మీద షాడో మంత్రులు అంటూ వార్తలు ప్రసారం చేసారని అనుచరులు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి సమయంలో ఉగ్రవాదులను,దొంగలను అరెస్ట్ చేసినట్లుగా కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురయ్యే విధంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే మీడియా ప్రతినిధులను పూర్తిగా ఇబ్బందులు గురి చేసే విధంగా పోలీస్ చర్యలను వారు తప్పు పట్టారు పత్రికా స్వేచ్ఛను మీడియా స్వేచ్ఛను హరించే విధంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఏమైనా తప్పుడు కథనాలని ప్రసారం చేస్తే ప్రజాస్వామ్య బద్ధంగా డెఫినేషన్ వేయొచ్చు కానీ వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు.మంత్రి ఎన్.ఎం.డీ ఫరూక్ కుమారులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నట్టు వార్తలు ఇస్తే.. న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి అక్రమ కేసులు పెట్టి జర్నలిస్టులను లొంగదీసుకోవాలని చూస్తే అది కుదరదని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.నంద్యాల టూ టౌన్ పోలీసులు దౌర్జన్యం చేయడం సిగ్గుచేటన్నారు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, రిపోర్టర్స్ పై బెదిరింపులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. అంతటితో ఆగకుండా రిపోర్టర్స్ పై నాన్ బెయిల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. రిపోర్టర్ల పై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో జర్నలిస్టులందరిని కలుపుకొని ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు.

# అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు.

# ఆదాయం తక్కువ - వర్కర్లు ఎక్కువ

## రాజకీయ ఊబిలో బండి ఆత్మకూరు పంచాయతీ

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 8:** బండి ఆత్మకూరు గ్రామపంచాయతీ నిర్వహణ విషయంలో రాజకీయ నాయకుల జోక్యం మితిమీరి పోవడంతో ప్రస్తుతం పంచాయతీ నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిడులకు కొందరు అధికారులు కూడా వంత పాడుతూ ఉండటంతో పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో ఏ గ్రామ పంచాయతీలోనూ వర్కర్లు లేనివిధంగా బండి ఆత్మకూరు గ్రామపంచాయతీలో నలుగురు వాటర్మెన్ లు పనిచేస్తున్నారు. గతంలో పంచాయతీలో ఒక్కరే వాటర్ మెన్ ఉండగా ప్రస్తుతం ఒక్కొక్క ట్యాంక్ కు ఒక వాటర్ మాన్ పనిచేస్తున్నారు. రాజకీయ నాయకుల సిఫారసులతో ఒకరిద్దరూ ఉండాల్సిన వాటర్ మెన్ ల సంఖ్య నాలుగు చేరుకుంది. ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున జీతం చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు స్వచ్ఛభారత్లో డంపింగ్ యార్డ్ లో చెత్త ను సేకరించేందుకుగాను ట్రాక్టర్ డ్రైవర్ను రాజకీయ సిఫారసుతోనే నియమించారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా బండి ఆత్మకూరులోని రెండు సచివాలయాల్లోనూ రెండు సంవత్సరాల క్రితం రాజకీయ నాయకుల సిఫారసుతో ఇరువురు స్వీపర్ ల ను నియమించారు. ఈ లెక్కన నలుగురు వాటర్ మెన్ లకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున 40 వేలు, ట్రాక్టర్ డ్రైవర్ కు 8000, సచివాలయ స్వీ ఫరులకు ఒక్కొక్కరికి 6000 చొప్పున 12000 పంచాయతీ చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన మొత్తం సిబ్బందికి నెలకు 60 వేల రూపాయలను చెల్లించాల్సి ఉంది. సిఫారసు చేసి పోస్టులను అయితే సృష్టించారు కానీ, వీరికి పంచాయతీ బోర్డు జీతాలు ఎలా తెలుస్తుంది అన్న విషయాన్ని మాత్రం రాజకీయ నాయకులు విస్మరించారు. సిబ్బంది అందరికీ ఏడాదికి 7 లక్షల 20వేల రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది. 2022- 23 నాటికి ఇంటి పన్నులు, నీటి పన్నులు, వేలం పాటలకు సంబంధించి ఆరు లక్షల 50 వేల రూపాయల ఆదాయం మాత్రమే వస్తుంది. పంచాయతీకి ఏడాది ఆదాయం ఆరు లక్షల 50 వేల రూపాయలు వస్తుంటే మరి పంచాయతీ సిబ్బందికి ఏడు లక్షల 20వేల రూపాయలను జీతాల క్రింద ఎలా చెల్లిస్తున్నారన్నది లోగుట్టు పెరుమాళ్ళ కెరుక అన్న రీతిలో సాగుతూ ఉంది. 2024-25 నుండి ఇంటి పన్నులు నీటి పనుల విషయంపై ప్రభుత్వం ఆన్లైన్ సిస్టం ప్రవేశపెట్టడంతో, ఏడాదికి ఆరు లక్షల 50 వేల రూపాయల ఉన్న ఆదాయం 11 లక్షల మేరకు పెరిగింది. పంచాయతీకి వచ్చే ఆదాయంలో 50 శాతానికి మించి సిబ్బందికి జీతాలను చెల్లించకూడదు అన్న నిబంధనలు ఉన్నప్పటికీ, పంచాయతీ అధికారులు ఈ విషయంలో ఏ విధంగా నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. 2025 నుండి పంచాయతీ ఆదాయం పెరిగినప్పటికీ, ఆదాయం తక్కువ, వర్కర్లు ఎక్కువ అనే రీతిలో నిర్వహణ సాగుతూ ఉంది. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వాటర్ మెన్ ల కాల పరిమితి ఈ ఏడాది జూన్ నాటికి ముగిసింది. అప్పటికే నాలుగు నెలల జీతాలను వాటర్ మెన్ ల కు చెల్లించాల్సి ఉంది. జూన్ తర్వాత కాల పరిమితి అయిపోయి మూడు నెలలు కావస్తున్న ప్పటికీ, ఈ లెక్కన ఏడు నెలల జీతాలను వాటర్ మెన్ల కు చెల్లించాల్సి ఉంది. జీతాల చెల్లింపు విషయంలో పంచాయతీ కారులు తలలు పట్టుకుంటూ, కాంట్రాక్టు పద్ధతిలో వీరిని కొనసాగించేలా ప్రతిపాదనలు పంపేందుకు అధికారులు వెనుకడు వేసే పరిస్థితి నెలకొని ఉంది. జీతాల చెల్లింపు విషయంలో పంచాయతీ సిబ్బంది రెండు రోజుల క్రితమే ఆత్మకూరు డి




ఎల్ డి ఓ ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచుకొని జీతాలను తీసుకోమని డి ఎల్ డి ఓ చెప్పినట్లుగా తెలుస్తోంది. బండి ఆత్మకూరులో దాదాపు 1600 నీటి కొళాయి కనెక్షన్లు ఉండగా, 1000 కులాయి కనెక్షన్లకు మాత్రమే నీటి పన్నులను వసూలు చేశారు. మిగతా 600 కులాయి కనెక్షన్లకు సంబంధించి నీటి పనులను వసూలు చేయడంలో కొందరు వాటర్ మెన్ లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 600 కులాయి కనెక్షన్లకు సంబంధించి నీటి పన్నులు వసూలు చేస్తే, వాటర్ మెన్లకు జీతాలు అందే అవకాశం ఉంది. పంచాయతీ నిర్వహణలో రాజకీయ జోక్యం మితిమీరిన కారణంతో పంచాయతీ అధికారుల పనితీరు ఎంకి పెళ్లి సుబ్బి చావు కొచ్చిందన్నట్లుగా మారింది.

# కడప "స్మార్ట్ కిచెన్"కు జైకా, నీతీ ఆయోగ్ ప్రశంసలు...!





## కొండపేట జెడ్పిహెచ్ఎస్ లో స్మార్ట్ కిచెన్, చెన్నూరు గర్ల్స్ హైస్కూలు మధ్యాహ్న భోజన అమలు తీరు పరిశీలన. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జైకా ప్రతినిధీ యుమికో ఓనిషి, జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8: నంది పత్రిక** విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పోషకాహారాన్ని అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, పరిశుభ్రత, బాధ్యత, సమైక్యతా భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న కడప జిల్లా స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. మంగళవారం చెన్నూరు మండలంలో జైకా టీమ్ లీడర్ యుమికో ఓనిషి, నీతి ఆయోగ్ ఆరోగ్యంపోషణ నిపుణుడు మోహిత్ సూద్ తదితరులు పర్యటించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, జేసీ డా. నిధీమీనా హాజరయ్యారు. తొలుత కొండపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్మార్ట్ కిచెన్ను సందర్శించి అక్కడ ఆహార తయారీ, పరిశు భ్రత, నాణ్యత ప్రమాణాలు, భోజనం పాఠశాలలకు తరలింపు, సమయపాలన, ఉష్ణోగ్రత పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్మార్ట్ కిచెన్ నిర్వహణ విధానాన్ని ఒక్కో విభాగం వారీగా వారికి వివరించారు. స్మార్ట్ కిచెన్ నిర్వహణ తీరును, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును ప్రత్యక్షంగా పరిశీలించిన జైకా బృందం.. జిల్లా యంత్రాంగం చేపట్టిన విధానంపై సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం చెన్నూరు మండల కేంద్రంలోని పీఎం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జైకా ప్రతినిధులు పరిశీలించారు. స్మార్ట్ కిచెన్ నుంచి సరఫరా చేసిన మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసిన యుమికో ఓనిషి.. ఆహారం నాణ్యత, రుచి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, పరిశుభ్రతను ప్రత్యక్షంగా గమనించారు. యుమికో ఓనిషి, మోహిత్ సూద్‌లతో పాటు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, పలువురు అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్మార్ట్ కిచెన్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, పోషకాహారంపై రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించగా.. వాటిని జిల్లా కలెక్టర్ స్వయంగా జైకా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం భోజనం అందించడమే కాకుండా.. భోజన సమయాన్ని ఒక అభ్యాస ప్రక్రియగా మార్చడమే ఏఎన్‌టీఎస్ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం, క్రమపద్ధతిలో భోజనం చేయడం, అవసరమైనంత మాత్రమే వడ్డించుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా చూడటం, భోజనం అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా చేస్తున్నట్లు తెలిపారు. జైకా ప్రతినిధి యుమికో ఓనిషి మాట్లాడుతూ.. స్మార్ట్ కిచెన్ వ్యవస్థ విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి ప్రవర్తనలోనూ సానుకూల మార్పులకు దోహదపడుతోందని ప్రశంసించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం, పాఠశాలలో అమలవుతున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా కార్యక్రమం యొక్క ప్రభావాన్ని తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. కడప జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న ఈ విధానం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే జైకా, నీతి ఆయోగ్ ప్రతినిధులతో జరిగిన వీడియో సమావేశంలో స్మార్ట్ కిచెన్ఏఎన్‌టీఎస్ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం వినూత్నంగా అమలు చేస్తోందని జైకా నిపుణురాలు యుమికో ఓనిషి అభినందించిన విషయం తెలిసిందే. తాజాగా క్షేత్రస్థాయిలో పర్యటించి స్వయంగా పరిశీలించడం, విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా కార్యక్రమంపై మరింత సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడి, పరిశుభ్రమైన, పోషకాహార మధ్యాహ్న భోజనం అందుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆహార తయారీ నుంచి సరఫరా వరకు నాణ్యత, సమయపాలన వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ వ్యవస్థను విద్యార్థుల సమగ్ర వికాసానికి అనుసంధానిస్తూ జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలకు తాజాగా జైకా ప్రతినిధుల ప్రశంసలు మరింత ప్రోత్సాహాన్ని అందించాయి. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళీ, డీఈవో శంశుద్దీన్, సమగ్రశిక్ష ఏపిసి అనురాధ, డీఆర్డీఏ పీడి డా. రాజ్యలక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.





## పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

### కమిషనర్ ఎం.జయకృష్ణ.

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** ఆర్ భరోసా పింఛన్ల కోసం అర్హులైన వారి నుంచి ఈ నెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్వర్ణ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్జెండర్లు తదితర అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కేటగిరీ ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులను సచివాలయ సిబ్బంది ఆన్ లైన్లో నమోదు చేసి రసీదు అందజేస్తారని తెలిపారు. అనంతరం అర్హతపై క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని చెప్పారు. అర్హులైన వారు గడువులోపు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎం.జయకృష్ణ ఆ ప్రకటనలో కోరారు.



## జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి

### బి. గురు జశ్వంత్ ను అభినందించిన డైరెక్టర్ షేక్షావలి రెడ్డి



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 8 ( నంది పత్రిక )** జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల కు గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎంపికయ్యారని ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంఎి కైన విద్యార్థి బి. గురు జశ్వంత్ ను అభినందించారు. విజయ వాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్ -12 విభాగంలో సత్తా చాటి సిల్వర్ మెడను సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు షేక్షావలి రెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ ఇండియా ఆధ్వర్యంలో 14వ మినీ & 8వ చైల్డ్ నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ బాలురు, బాలికలు విభాగంలో సెప్టెంబర్ 23 నుండి 27 తేదీ వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని జమ్మూ కాశ్మీర్ ఫెన్సింగ్ అసోసియేషన్ నిర్వహించే పోటీల్లో గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి బి. గురు జశ్వంత్ పాల్గొంటారని జాతీయ స్థాయిలో సత్తా చాటి విజేతగా నిలబడాలని ఆకాంక్షించారు.

## సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో వచ్చే నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్ తో సైబర్ మోసాలు.

### తెలియని లింకులను క్లిక్ చేసి నమ్మి మోసపోవద్దు . హెచ్ డి ఎఫ్ సి సెక్యూరిటీస్ పేరుతో నకిలీ యాప్స్, ఎపికే ఫైల్స్ ల పట్ల జాగ్రత్త ఉండాలి. అధిక లాభాల ఆశ చూపితే నమ్మవద్దు ... సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** హెచ్ డి ఎఫ్ సి సెక్యూరిటిస్ పేరుతో లేదా ఆ సంస్థ లోగోను ఉపయోగించి సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ లలో ప్రచారం జరుగుతున్న నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, ఎపికే ఫైల్స్ లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం తెలిపారు. సైబర్ నేరగాళ్లు మొదట చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టించి, యాప్‌లో అధిక లాభాలు వచ్చినట్లు చూపిస్తారని, కొంత మొత్తాన్ని ఉపసంహరించుకునే అవకాశం కల్పించి బాధితుల్లో నమ్మకం కలిగిస్తారన్నారు. అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా చేసి, డబ్బుఉపసంహరించుకోవాలంటే ట్యాక్స్, ఛార్జీలు, ఇతర కారణాల పేరుతో మరింత డబ్బు చెల్లించాలని చెప్పి మోసం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే అనుమానాస్పద ఇన్వెస్ట్‌మెంట్ లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని ఏపీకే ఫైల్స్ లేదా యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దని సూచించారు. యాప్ అధికారికమైనదో కాదో నిర్ధారించుకోవడంతో పాటు, సంబంధిత సంస్థ సెబీ రిజిస్ట్రేషన్ వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపారు. అధిక లాభాలు లేదా గ్యారంటీడ్ రిటర్న్స్ ఇస్తామని చెప్పేవారిని నమ్మవద్దని, పెట్టుబడి పెట్టే ముందు పూర్తి అవగాహనతో నిర్ణయం తీసుకోవాలని కర్నూలు ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సైబరక్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ " ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి.. జర్నలిస్టు, ప్రజా సంఘాలు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కర్నూలులో జర్నలిస్టులు, ప్రజా,విద్యార్థి, యువజన,బిసి సంఘాలు ముక్త కంఠంతో డిమాండ్ చేసాయి. జర్నలిస్టులపై పెడుతున్న అక్రమ కేసులకు వ్యతిరేఖిస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాలు, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు, వామపక్ష పార్టీలు ధర్నా నిర్వహించాయి. జర్నలిస్టులపై కేసులంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి, రాజ్యాంగ విరుద్ధమని సంఘాల నాయకులు అన్నారు. న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ పై ఐ న్యూస్ లోగుట్టు కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, మంత్రి కుమారులు నంద్యాల ఐ న్యూస్ విలేఖరులను బెదిరించారు. ఐ న్యూస్ కథనాన్ని సోషల్ మీడియా లింక్ లను తొలగించాలని జర్నలిస్టులపై ఒత్తిడి తెచ్చారు. వీరు ససేమిరా అనడంతో నంద్యాల ఐ న్యూస్ విలేఖరులు సురేష్,చంద్రుడు, ఐన్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజులపై నంద్యాల పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసారు. వీరిలో సురేష్, చంద్రుడులను అర్ధరాత్రి అరెస్ట్ చేసి అర్ధరాత్రి రిమాండ్ కు పంపించారు. స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు అరెస్ట్ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. జర్నలిస్టుల అరెస్టులు,రిమాండ్లపై జర్నలిస్టు సంఘాలు భగ్గుమన్నాయి. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాకు జిల్లాలోని ప్రజాసంఘాలు,వామపక్ష పార్టీలు,బిసి,విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు ఇచ్చి ధర్నాలో పాల్గొన్నాయి. జర్నలిస్టులపై కేసులను ముక్త ఖంఠంతో ఖండించాయి. కేసులంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నాయి. జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. లోగుట్టు కథనంలో మంత్రికి అభ్యంతరాలు ఉంటే కోర్టుకు వెళ్లాలని, జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు ఏమిటని ప్రశ్నించాయి. న్యాయ శాఖ మంత్రికి న్యాయస్థానాల మీద నమ్మకం లేనట్టుందని,అందుకే మంత్రి తన పదవి అధికారంతో జర్నలిస్టుల మీద అక్రమ కేసులను పెట్టించాడని అన్నారు. జర్నలిస్టులపై కేసులు,అరెస్టులంటే భావ ప్రకటన స్వేచ్ఛ మీద దాడి చేసినట్టేనని అన్నారు. భావప్రకటన స్వేచ్ఛ, రాజ్యాంగం మీద నమ్మకం లేని మంత్రి ఫరూఖ్ ను యావత్ పత్రికా మీడియా బహిష్కరించాలని విజ్ఞప్తి చేసాయి. ధర్నా కార్యక్రమంలో రాయలసీమ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్టు ఫౌండర్ ప్రసిడెంట్ సత్యన్న, ఏపిఎంఎఫ్ నాయకుడు నాయుడు, ఏపియుడబ్ల్యూ జెఎఫ్ రాష్ట్ర నాయకుడు గోరంట్లప్ప, శివ శంకర్, ఏపియుడబ్ల్యూజె నాయకుడు శ్రీనివాసులు గౌడ్, సిపిఐ నాయకుడు రామక్రిష్ణ రెడ్డి, పిడిఎస్ యు నాయకుడు భాస్కర్, బిసి సంఘం నాయకుడు శేషఫణి, సిపిఐ ఎం ఎల్ నాయకుడు వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్టులు శ్రీనాథ్ రెడ్డి, శివ, ఆర్ టివి హుస్సేన్, వివిధ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్లు, వీడియో జర్నలిస్టులు, ఫోటో గ్రాఫర్లు పాల్గొన్నారు.



# ప్రజా వ్యతిరేక నిర్ణయాల రద్దు కోరుతూ అఖిలపక్షం చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల స్వచ్ఛంద మద్దతు






**నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలి... నూనెపల్లె మార్కెట్ యార్డు స్థల కేటాయింపును రద్దు చేయాలి.**

**గాంధీ చౌక్ నుంచి మెయిన్ బజార్ వరకు పోస్టుకార్డు ప్రచారం.. ప్రజా ఒత్తిడికి పదునైన అస్త్రం.**

**125 ఏళ్ల చరిత్ర గల అర్.ఏ.అర్.ఎస్ ను కాపాడండి...**

**రైతు ప్రయోజనాలను పరిరక్షించండి**

**అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపు**

నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 8 ( నంది పత్రిక ) నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సమస్యలపై అవగాహన పెంచుకున్న ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేశారు. సెప్టెంబర్ 2న ప్రారంభమైన ఈ ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 8న నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి పప్పుల బజారు, రెడ్డి చావడి, సిమెంట్ రోడ్డు మీదుగా మెయిన్ బజార్ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలకు రెండు సమస్యలపై అవగాహన కల్పించగా, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పోస్టుకార్డులు రాసి పోస్టుబాక్సుల్లో వేశారు. ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, దాదాపు 125 ఏళ్ల చరిత్ర కలిగిన వ్యవసాయ పరిశోధనలకు కీలకమైన సంస్థ అని తెలిపారు. ముఖ్యంగా విత్తన పరిశోధన, వ్యవసాయ సాంకేతిక అభివృద్ధి, రైతులకు ఉపయోగపడే పరిశోధనలకు ఇలాంటి సంస్థలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అటువంటి పరిశోధనా సంస్థ ప్రాంగణంలో తాత్కాలిక కలెక్టరేట్ ఏర్పాటు చేయడం వల్ల పరిశోధన కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోందని, కలెక్టరేట్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ఈ స్థల కేటాయింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. రైతు నష్టపోతే నష్టపోయేది రైతు ఒక్కరే కాదని, రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిపైనే సమాజ ఆహార భద్రత ఆధారపడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. అందువల్ల వ్యవసాయ పరిశోధనా సంస్థలను పరిరక్షించడం, రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన మార్కెట్



యార్డులను కాపాడటం ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ రెండు సమస్యలపై ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేయడం, ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడి పెంచి ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయాలను ఉపసంహరించేలా చేయడం పోస్టుకార్డు ఉద్యమం ప్రధాన లక్ష్యమని అఖిలపక్ష నాయకులు తెలిపారు. పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం, సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు ఏర్వ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కో-కన్వీనర్లు ఎజాస్, జానయ్య, చిన్న రామకృష్ణ రెడ్డి, అడ్వకేట్ శంకరయ్య, యర్రం శంకర్ రెడ్డి, విద్యార్థి నాయకుడు రాంబాబు, చౌడప్ప, చింతలయ్య, అడ్వకేట్ నాగేశ్వరరెడ్డి, పట్నం రాముడు, రామ్మోహన్ రెడ్డి, మోహన్ బాబు, షణ్ముఖరావు, మజీద్ ఖాన్,సి.పి. ఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు,సి.పి. ఐ నాయకులు బాబా ఫకృద్దీన్ ,రైతు సంఘం నాయకులు రాజు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతి వారోత్సవాలు.



బేతంచెర్ల సెప్టెంబర్ 8 ( నందిపత్రిక ). వాసవి క్లబ్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమర యోధులు స్వర్గీయ కె.సి. గుప్త జయంతిని విసిఐ వారోత్సవాలును సెప్టెంబర్ 1 వతేది నుండి 7 వతేది వరకు నిర్వహించిన సందర్భంగా చివరి నాడు బేతంచెర్ల పట్టణం, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం (అమ్మవారి శాల) నందు వాసవి మరియు వనిత క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన వాసవి వారోత్సవాల ముగింపు సభలో వాసవి & వనిత క్లబ్ అధ్యక్షులు ఎంవి. రమణ, కెగీత అధ్యక్షతన జరిగిన సభలో సమాజ హితం కోసం పాటుపడే గురువులను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గుండా గోపాల్, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కంద గడ్డల మోహన్ రావు, అనుముల విజయలక్ష్మి, సులోచన, బళ్లాని సూర్య, బివి సుబ్రహ్మణ్యం, చంద్రావతి, రాజేశ్వరి, కందగడ్డల జనార్ధన్, రాజేంద్ర కుమార్, కల్కి సతీష్, విష్ణు, కిషోర్,సురేంద్ర విశ్రాంత ఆచార్యులు ప్రతాప్ కుమార్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణా రెడ్డి, ఆర్య వైశ్య సంఘం కమిటి సభ్యులు, అధిక సంఖ్యలో ఆర్యవైష్యులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను పూజిద్దాం... పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుదాం...

**కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపు.**



తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక నగర ప్రజలందరూ మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణలో ఇతోదికంగా భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందిరామైదానం లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన వినాయక చవితి మంటపాల అనుమతుల మంజూరు హెల్ప్ లైన్ సెంటర్ ను మంగళవారం కమిషనర్ సందర్శించారు. వినాయక చవితికి మంటపాల అనుమతుల ధ్రువపత్రాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిమజ్జన ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలుపారు. నగరంలో వినాయక చవితి వేడుకలు భక్తిబావంతో జరుపుకునేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. చవితి వేడుకలు నిర్వహించే వారు మంటపాల ఏర్పాటుకు అన్ని విభాగాల అధికారుల కార్యాలయాలకు వెళ్లకుండా ఒకే చోట అన్ని అనుమతులు ఇచ్చేలా ఈ సింగిల్ విండో కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిర్వాహకులు అందరూ ఇక్కడ అనుమతులు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. నగరంలో చవితి వేడుకల నిర్వహణపై ఇప్పటికే పలు సూచనలు, నిబంధనలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. అందరూ వాటిని తప్పకుండా పాటించాలని, భక్తి భావంతో ఆనందంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవ కమిటీ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఉత్సవ కమిటి కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు ఆర్.సి.మునికృష్ణ, నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్, మాంగాటి గోపాల్ రెడ్డి, పలువురు పాల్గొన్నారు.




# వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

**హంద్రీనీవాలో 3 ప్రాంతాల్లో నిమజ్జనానికి అవకాశాలు**

**మంత్రి టీజీ భరత్**

**ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించిన మంత్రి టీజీ భరత్**



కర్నూల్ సిటీ నంది పత్రిక హంద్రీనీవాలో వినాయక నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుంకేసులలో నీటి లభ్యత లేని కారణంగా కె.సి కెనాల్‌కు నీరు విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదని ఆయన తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరిస్తూ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 2వ తేదీన అధికారులు నిర్వహించిన సమీక్షలో ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే హంద్రీనీవాకు నీరు తీసుకునేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. అప్పుడు కూడా చిన్న విగ్రహాలు మాత్రమే హంద్రీనీవాలో నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశం తర్వాత.. ఇప్పటి నుండి మరో 12 లేదా 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో పాటు పెద్ద విగ్రహాలు సైతం నిమజ్జనం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తామని అధికారులు చెప్పినట్లు మంత్రి తెలిపారు. హంద్రీనీవాలో మూడు రోజుల పాటు అంటే వినాయకుడిని ప్రతిష్టించిన తర్వాత 5వ రోజు, 7వ రోజు, 9వ రోజు నిమజ్జనం చేసుకునేందుకు ఇప్పుడున్న పరిస్థితిని బట్టి అవకాశాలుఉన్నాయన్నారు. ఇందులో ప్రధానంగా 5వ రోజు, 7వ రోజు నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని.. నిమజ్జనం చేయడానికి అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపారన్నారు. 9వ రోజు నిమజ్జనానికి ఎంతమేర అనుకూలత ఉంటుందో ఇప్పుడున్న పరిస్థితిని బట్టి ఖచ్చితంగా అంచనా వేయలేమన్నారు. నిమజ్జనం చేసేందుకు నన్నూర్ టోల్‌గేట్, తడకనపల్లె, ఉలిందకొండ వద్ద హంద్రీనీవాలో ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతాన్ని వినాయక నిమజ్జన కమిటీ వారు ఎంపిక చేసి చెబితే.. గత కొన్ని సంవత్సరాలుగా కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ తరుపున నిమజ్జన సమయంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారో అదేవిధంగా ఈ ఏడాది కూడా నిమజ్జన కమిటీ ఎంపిక చేసిన ప్రాంతంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ తరుపున పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలు ఒక అడుగు లేదా అడుగున్నర మట్టి విగ్రహాలు మాత్రమే ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు. చిన్న విగ్రహాలైతే ఇంటి వద్దనే నిమజ్జనం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం వినాయక నిమజ్జన కమిటీ, అధికారులు ఎంపిక చేసిన ప్రాంతంలో నిమజ్జనం చేస్తామని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇక వర్షాలు కురిసేందుకు దేవాదాయ శాఖ తరుపున రాష్ట్ర వ్యాప్తంగా వరుణ యాగం చేయాలని క్యాబినెట్ సమావేశంలో చర్చించామని, కర్నూలులో గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహిస్తామన్నారు. వర్షాలు కురిసి సుంకేసులకు నీరు వస్తే కెసి కెనాల్‌కు నీరు వస్తుందన్నారు. అప్పుడు అక్కడ నిమజ్జనం చేసుకోవచ్చన్నారు. అయితే ఇప్పుడున్న పరిస్థితిని బట్టి కె.సి కెనాల్‌లో నిమజ్జనం చేసేందుకు అవకాశం లేదన్నని అర్థం చేసుకొని సహకరించాలని ఆయన ప్రజలను కోరాను.

# శుభకార్యాలకు అనుమతి తప్పనిసరి




**అధిక జనంతో కార్యక్రమాల నిర్వహణకు 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలి**

**చెత్త సేకరణకు ప్రత్యేక ట్రాలీ ఏర్పాటు చేస్తాం**

**త్వరలో మరో 10 ఈ-ఆటోలు రాక**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు నగరంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇతర శుభకార్యక్రమాలను నిర్వహించే ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు తప్పనిసరిగా 48 గంటల ముందు రూ. 2,000 రుసుము చెల్లించి నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందాలని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. కార్యక్రమాల సమయంలో పెద్ద మొత్తంలో ఉత్పత్తయ్యే చెత్తను సక్రమంగా సేకరించేందుకు ప్రత్యేక ట్రాలీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనుమతి, ఇతర పూర్తి వివరాల కోసం 9849908486 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మంగళవారం వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అయ్యప్పస్వామి ఆలయం వెనుక టీ దుకాణం వద్ద వ్యర్థాలను కేసీ కెనాల్‌లో వేస్తుండటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనిని ఆదేశించారు.

అనంతరం గ్రీన్ పార్క్ వద్ద బండ్‌పై నిర్మించిన సీసీ రహదారిని కమిషనర్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందిని సూచనలు చేశారు. అదేవిధంగా వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోల పార్కింగ్, చార్జింగ్, చెత్త బదిలీ ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. ప్రస్తుతం 30 విద్యుత్ ఆటోలు వినియోగంలోకి వచ్చాయని, త్వరలో మరో 10 ఆటోలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వీటి ద్వారా చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. నగరంలో శుభకార్యాలు, ఇతర భారీ కార్యక్రమాల సమయంలో పెద్ద మొత్తంలో చెత్త ఉత్పత్తి అవుతున్నందున ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు ముందస్తుగా నగరపాలక సంస్థకు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమ సమయంలోనే చెత్తను సేకరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు, ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీఈ నరేష్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, జిలానీ, శివశంకర్, ఫరూక్, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# నాయకత్వానికి కొత్త దిశ.. లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ రెండో రోజు శిక్షణలో కార్యక్రమంలో కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

కర్నూల్ సిటీ నంది పత్రిక మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకత్వాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం, ప్రజలతో సత్సంబంధాలను బలోపేతం చేసుకోవడం, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయడం, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై శిక్షణ అందించారు. పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వ లక్షణాలు, ప్రజా సమస్యలపై స్పందించే విధానం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసే అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించారు. ఈ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ ద్వారా నాయకులు, కార్యకర్తల్లో నాయకత్వ నైపుణ్యాలను మరింత పెంపొందించి, క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన దిశానిర్దేశం లభించిందని గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు.



# రాయలసీమలో మొదటిసారిగా నంద్యాలలో

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో మోకాలు కీళ్ల మార్పిడి



శస్త్ర చికిత్స చేసిన నంద్యాల జీ.ఎస్.ఆర్.ఆసుపత్రి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మహమ్మద్ రఫీ,డాక్టర్ గుంటి శ్రీకాంత్, మత్తు వైద్యులు డాక్టర్ మధు సూధన రెడ్డి

ఎ.ఐ.( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత జర్మన్ సాంకేతిక సహకారంతో

ఈ పద్ధతి శస్త్ర చికిత్సలో ప్రయోజనాలు: కచ్చితత్వం,త్వరితగతిన కోలుకోవడం, మెరుగైన కీళ్ల పనితీరు

అధునాతన ఏఐ(కృత్రిమ మేధ) విధానంలో కీళ్ల శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించిన డాక్టర్ రవి కృష్ణ , ఐఎంఏ నంద్యాల వైద్యులు.

**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 08 . (నంది పత్రిక ):**స్థానిక పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న జీ ఎస్.ఆర్. హాస్పిటల్‌లో 70 ఏళ్ల మహిళకు అధునాతన కృత్రిమ మేధ( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ) సహకారంతో జర్మన్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం గా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను జీఎస్ఆర్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డా. మహమ్మద్ రఫీ మరియు డా. గుంటి శ్రీకాంత్ నిర్వహించగా, అనస్థీషియాను సీనియర్ అనస్థీషియా వైద్యులు డా. మధుసూదన్ రెడ్డి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సలో జర్మన్ ఇంజినీరింగ్‌తో రూపొందించిన ఇంటెలిజెన్షియా రోబోటిక్-సహాయక మోకాలి మార్పిడి వ్యవస్థను వినియోగించారనీ, ఈ కృత్రిమ మేధ వినియోగంతో శస్త్రచికిత్సలో కచ్చితత్వాన్ని పెంచడంతో పాటు, ఇంప్లాంట్ అమరికను మెరుగుపరచడం మరియు సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే వేగవంతంగా కోలుకోవడానికి తోడ్పడుతుందన్నారు.దీర్ఘకాలిక కీళ్ల పనితీరు మెరుగుపడుతుందని అన్నారు.ఇటువంటి అధునాతన ఏఐ ఆధారిత మోకాలి మార్పిడి శస్త్రచికిత్స రాయలసీమ ప్రాంతంలో నిర్వహించడం మొదటి సారి కావడం విశేషం అన్నారు.జి ఎస్ ఆర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సేవల్లో ఈ శస్త్ర చికిత్స ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.శస్త్రచికిత్సలో వినియోగించిన మోకాలి ప్రొస్థెసిస్‌ను ప్రముఖ ఆర్థోపెడిక్ ఇంప్లాంట్ తయారీ సంస్థ మెరిల్ అందించిందనీ. ఈ ప్రక్రియలో మెరిల్ కంపెనీ



ప్రతినిధులు నరేష్, రఘు, బాలు సాంకేతిక సహకారం అందించారు.శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు తెలిపారు.అత్యాధునిక సాంకేతికతలను అందుబాటులోకి తెచ్చి, ప్రపంచస్థాయి ఆర్థోపెడిక్ చికిత్సను రోగులకు అందించేందుకు ముందుకు వచ్చిన జీఎస్ఆర్ హాస్పిటల్ వైద్య బృందాన్ని ఐ ఎమ్ ఏ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు, లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, నంద్యాల అనస్తీసియా వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మధుసూధన రెడ్డి, రాష్ట్ర ఐ ఎమ్ ఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్ల పాలకుల నిర్లక్ష్యం విడనాడాలి,,

### సిపిఐ పార్టీ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి




**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం జగన్నాథ్ గట్టులోని ఇందిరమ్మ ఇండ్లను సందర్శించడం జరిగినది సందర్శించిన వారిలో సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు నగర పార్టీ సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు నల్లన్న గిడ్డమ్మ బిసన్న భద్ర కుమార్ అన్వర్ భాష డప్పు మాణిక్యం అఖిల్ శివ శ్రీరాములు సందర్శించిన వారిలో ఉన్నారు ఈ సందర్భంగా మీడియాతో సిపిఐ నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2009 సంవత్సరం కర్నూలు నగరానికి వరదలు వచ్చిన సందర్భంగా ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య కర్నూలు నగరాన్ని సందర్శించి ఎక్కడైతే వరదలకు పేదల గురి అయ్యారో ఆ ప్రాంత వాసులందరికీ ఇందిరమ్మ గృహాల పేరుతో జగన్నాథ్ గట్టులో స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించుకోవడానికి ఎస్సీలకు 75000 బీసీలకు 60000 ఓసి లకు 45 వేల రూపాయల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం డబ్బులు మంజూరు చేయడం జరిగినది ఈ మంజూరైన డబ్బులు నిర్మాణానికి ఏమాత్రం సరిపోకపోవడంతో ప్రతి లబ్ధిదారుడు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల వరకు ఖర్చు చేసి ఇల్లు నిర్మించుకోవడం జరిగింది ప్రభుత్వ వారు మౌలిక సదుపాయాల లో భాగంగా మంచినీళ్లు కరెంటు సౌకర్యం కల్పించినప్పటికీ ఇక్కడ ఇండ్లు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు ఆనాటి నుండి నేటి వరకు దాదాపు 16 సంవత్సరాలుగా 8500 ఇండ్లు నిరుపయోగంగా ఉన్నాయి వీటిని పూర్తి చేయాలని గతలో అనేక దఫాలుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మంత్రులను అధికారులను కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది 8500 మంది లబ్ధిదారులు నేడు కూటమి ప్రభుత్వ రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని చెప్పింది దానికి దరఖాస్తు చేసుకోవడానికి వెళితే నీకు ఇందిరమ్మ ఇండ్లు ఉంది నీకు స్థలం మంజూరు కాదు అని అధికారులు చెబుతున్నారు ఇందిరమ్మ ఇల్లు రాలే ప్రభుత్వం చెప్పిన రెండు సెంట్లు ఇంటి స్థలానికి అర్హత లేదు మరి 8500 మంది ఏమి చేయాలి మంత్రులు మరియు అధికారులు ఆలోచన చేసి ఒక నిర్ణయం తీసుకొని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో లబ్ధిదారులందరినీ కలిసి ఐక్యం చేసి ప్రభుత్వం పైన పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.

# అభివృద్ధి పనుల పురోగతి సంతృప్తికరం...!



**ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ ఇసాక్ బాషా**

**మైలవరం జలాశయాన్ని అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

**ఒంటిమిట్ట, రిమ్స్, బ్రౌన్ గ్రంథాలయం, టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు**

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8: నంది పత్రిక** వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ హామీల అమలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఏపీ శాసనమండలి ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ప్రభుత్వ హామీల కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఏపీ శాసనమండలి ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, కమిటీ జాయింట్ సెక్రటరీ పి.వి. సుబ్బారెడ్డి హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, సీపీవో హాజరతయ్య, వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ హామీలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో కమిటీ సమీక్షించింది. అనంతరం చైర్మన్ ఇసాక్ బాషా, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు.

రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి ఒంటిమిట్ట, రిమ్స్, బ్రౌన్ గ్రంథాలయం, జలాశయాలు, గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల, టెక్స్‌టైల్ పార్క్ తదితర ప్రాంతాల్లో పనులను పరిశీలించినట్లు చెప్పారు.మైలవరం జలాశయాన్ని మరింత అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందని ఇసాక్ బాషా తెలిపారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్న సమయంలో ఏర్పడే ద్వీపాన్ని రోప్‌వేతో అనుసంధానం చేసి పర్యాటకులకు అవసరమైన వసతి, ఆహార సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చున్నారు. దీనిపై ప్రభుత్వానికి కమిటీ తరపున సిఫారసు చేస్తామని తెలిపారు.మైలవరం జలాశయంలో నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ప్రాంతాలను శుభ్రపరచడంతో పాటు నీటి నిల్వ, నిర్వహణను మెరుగుపరచాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. జలాశయ నిర్వహణకు అవసరమైన సిబ్బంది కొరతను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒంటిమిట్టలో శ్రీరామనవమి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించినట్లు తెలిపారు. భక్తుల కోసం అదనంగా వసతి గదులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులు, రాకపోకలు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచాలని పేర్కొన్నారు.రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది పరిస్థితిని పరిశీలించామని తెలిపారు. చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పనుల పురోగతిని కూడా పరిశీలించి అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని సూచించామన్నారు. కడపలోని బ్రౌన్ గ్రంథాలయం విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఇసాక్ బాషా తెలిపారు. గ్రంథాలయాన్ని మరింత విస్తరించి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు క్రీడా కార్యకలాపాలు కూడా బాగున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించాలని సూచించినట్లు చెప్పారు.టెక్స్‌టైల్ పార్క్ పనులను కూడా పరిశీలించామని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యటించిన సందర్భంగా వివిధ అభివృద్ధి పనులను పరిశీలించామని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఒంటిమిట్ట, రిమ్స్, బ్రౌన్ గ్రంథాలయం, జలాశయాలు, పాఠశాలలు, టెక్స్‌టైల్ పార్క్ తదితర ప్రాంతాల్లో గుర్తించిన అంశాలను సమీక్ష సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు





## కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

### బీఎస్పీ కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆందోళన కొనసాగుతోంది.దీక్ష కు మద్దతు తెలిపి మాట్లాడుతున్న బీఎస్పీ కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ పదహారు రోజులుగా నిరాహారదీక్షలు కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడం బాధాకరం అనిగత వైసిపి ప్రభుత్వం కర్నూల్ కు హైకోర్టు తీసుకొని వస్తామని వాగ్దానం చేశారు. ఈ తెలుగుదేశం ప్రభుత్వం హైకోర్టు బెంచిని కర్నూల్ కు తీసుకొని వస్తున్నామని చెప్పారు,2014,2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం కర్నూలుకు హైకోర్టు కాకపోయినా కనీసం బెంచ్ అయినా ఏర్పాటు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారు. అయితే గత కొద్ది రోజులుగా బెంచ్ క్యాంపు మాత్రమే ఏర్పాటు చేస్తున్నాయన్న ఊహాగానాలు రావడంతో న్యాయవాదులంతా నిరాశ చెందుతున్నారు కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేసి ప్రజలకు భరోసా కల్పించాలన్నారుఅలాగే పత్తికొండలో సపోర్ట్ ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు న్యాయవాదులు చేస్తున్న ఈ పోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు నిస్తుందని అరుణ్ కుమార్ తెలిపారు. మంగళవారం దీక్షలో కూర్చున్న న్యాయవాదులు బన్నూరు దేవప్రసాద్, కె ప్రేమ్ కుమార్, ఈ ఆర్ సాయి ప్రదీప్, షేక్ అఫర్జ్ భాష, గోర్ల కమలేష్, ఆర్ సత్య సావిత్రి, కె కేశవ రామ్, ఏ చిన్న మౌలాలి, జి రాజేష్ బాబు, ఏం రామలింగడు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్

### సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.51 లక్షల వైద్యసాయం మంజూరు

### ఆపత్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి






**నంది పత్రిక ఆత్మకూరు..** మండల పరిధిలోని కరివేన గ్రామం గ్రామానికి చెందిన గాలిముట్టి నరసయ్య ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కు గురై గుంటూరులోని కిమ్స్ శిఖర ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చికిత్స ఖర్చులు భరించడం కుటుంబానికి భారంగా మారిన నేపథ్యంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి వారికి అండగా నిలిచారు.రోగి పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారావైద్యసాయంఅందేలా చర్యలు తీసుకున్నారు. ాాజ ద్వారా మెరుగైన చికిత్స కోసం రూ.2,51,532 లు మంజూరు చేయించారు. ఈమేరకుకుటుంబ సభ్యులకుమంజూరుపత్రాన్ని మంగళవారంవిజయవాడలో అందజేశారు.ఈ సహాయంతో నరస య్యకు అవసరమైన వైద్యచికిత్సకొనసాగించేందుకు మార్గం సుగమమైంది. ఆపదలో ఉన్న తమ కుటుంబానికి అండగా నిలిచి, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , తమ సమస్యను మాన వతా దృక్పథంతోపరిష్కరించేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి నరసయ్య కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచిందనిడ ఎమ్మెల్యే మా సమస్యను పట్టించుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైద్యం కోసం సహాయం అందడంతో మా కుటుంబానికి ఎంతో ధైర్యం వచ్చింది. ఈ సహాయాన్ని జీవితాంతం మర్చిపోలేం అంటూ కుటుంబసభ్యులుభావోద్వేగానికి లోనయ్యారు.

# కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

## ఎల్‌నినో ప్రభావంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో: రెడ్యం

**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 08** ఖాజీపేట: ఎల్‌నినో ప్రభావం, వర్షపాత లోటు, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వైఎస్సార్ కడప జిల్లాను కరువు ప్రభావిత జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఖాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. త్రిపురవరం గ్రామంలో సాగునీరు లేక పంట సాగు చేయకుండా వదిలేసిన పొలాలను మహానంది వినోద్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీ కెనాల్, బ్రహ్మంసాగర్, గండికోట నీటిని సాధ్యమైన మేరకు సాగుకు వినియోగించాలని, ఉపాధి హామీ పనిదినాలను పెంచి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరారు. రైతులకు పంటల బీమా ద్వారా ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నేతలు పాలగిరి వెంకటసుబ్బారెడ్డి, ఏనుగు రాజగోపాల్‌రెడ్డి, గుర్రంపాటి శ్రీనివాసులరెడ్డి, కొండా పోలిరెడ్డి, భూమిరెడ్డి సన్నారెడ్డి, దండుబోయిన సుబ్బరాయుడు యాదవ్, కడప గురుప్రసాద్, కొండా శివారెడ్డి, మీగడ హరి కేశవరెడ్డి, మీగడ ప్రతాపరెడ్డి తదితరులు, రైతులు పాల్గొన్నారు.



## చావు రాజకీయాలు చేయిస్తారా?

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను భౌతికంగా అంతమొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని... స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చావును కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియా ముఖంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ నిప్పులు చెరిగారు. కేసీఆర్ నివాసమైన ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌పై దాడులు చేస్తామని, 'చావు డప్పు' కొడతామని ఎమ్మెల్యే శంకర్ బహిరంగంగా వ్యాఖ్యానించడం రాజ్యాంగ ఉల్లంఘన అని మండిపడ్డారు.

# కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం.

## వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి హాజరయ్యారు.కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ ప్రస్తుత పరిస్థితులు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు కాటసాని రామభూపాల్ రెడ్డి కీలక దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ చిన్నచిన్న కేసులు నమోదు చేయడం, రాజకీయ వేధింపులకు గురిచేయడం వంటి చర్యలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా కార్యకర్తలు భయపడకుండా, ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసు వ్యవస్థ ప్రజల రక్షణ కోసం పనిచేయాల్సిన వ్యవస్థ అని.. రాజకీయ కక్ష సాధింపులకు పోలీసు వ్యవస్థను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ప్రతి కార్యకర్త చట్టపరమైన విషయాల్లో అప్రమత్తంగా ఉంటూ, పార్టీ కోసం ధైర్యంగా పనిచేయాలని సూచించారు.ఎన్నికల హామీలు ఏమయ్యాయి. 2024 ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను ఆకర్షించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత లేకుండా పోయిందని కాటసాని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని.. హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.జగన్ హయాంలో పారదర్శక పాలన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు, డీఎస్సీ వంటి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రాధాన్యత ఇచ్చిందని కాటసాని గుర్తుచేశారు.ఎటువంటి రాజకీయ జోక్యం, అవకతవకలకు తావులేకుండా నిర్దిష్ట విధానాలతో పరీక్షలు నిర్వహించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పనిచేసిందని పేర్కొన్నారు.కార్యకర్తలే పార్టీకి వెన్నెముక.ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని కాటసాని అన్నారు.ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. ప్రజలకు అండగా నిలుస్తూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా పార్టీ కోసం, ప్రజల కోసం, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జీలు,సి ఈ సి & యస్ ఈ సి సభ్యులు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



## రాత్రి వేళల్లోనూ ప్రజలకు సేవలు అందిస్తున్న పత్తూరు సచివాలయ సిబ్బంది



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 08** పత్తూరు: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలు సకాలంలో అందించాలనే ఉద్దేశంతో పత్తూరు సచివాలయం సిబ్బంది రాత్రి వేళల్లోనూ విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి 8 గంటలు అవుతున్నా సచివాలయంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి పెన్షన్ దరఖాస్తులను స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను కొనసాగించారు.పెన్షన్‌కు అర్హులైన ప్రజలు దరఖాస్తుల కోసం సచివాలయానికి చేరుకోగా, వారి వివరాలను పరిశీలించి అవసరమైన ప్రక్రియను సిబ్బంది పూర్తి చేస్తున్నారు. కార్యాలయ సమయం ముగిసినప్పటికీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాత్రి వరకు పనిచేయడం పట్ల స్థానికులు సిబ్బందిని అభినందిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంలో సచివాలయ సిబ్బంది చూపుతున్న సేవాభావం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

# లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**మంగళగిరి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8: నంది పత్రిక**

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజు నిర్వహించిన ప్రతిష్టాత్మక లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ప్రారంభమైన ఈ కాంక్లేవ్ మంగళవారం రెండో రోజు జరిగింది.పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ తో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలు, పార్లమెంట్ పరిశీలకులు, పార్టీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు ఈ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల్లో నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించడం, పార్టీప్రభుత్వ సమన్వయాన్ని బలోపేతం చేయడం, ప్రజలతో మరింతగా అనుసంధానం కావడం ప్రధాన లక్ష్యాలుగా కాంక్లేవ్‌ను నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భవన్‌లోని టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పార్టీప్రభుత్వ సమన్వయంపై దిశానిర్దేశం** రెండు రోజుల పాటు నిర్వహించిన కాంక్లేవ్‌లో ప్రజాప్రతినిధుల పనితీరు, పార్టీప్రభుత్వ సమన్వయం, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధానం, పార్టీ కేడర్‌తో సమన్వయం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం వంటి కీలక అంశాలపై శిక్షణా తరగతులు, చర్చలు నిర్వహించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధానం, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపైనా నాయకులకు దిశానిర్దేశం చేశారు . కాంక్లేవ్ రెండో రోజైన మంగళవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ అధినాయకత్వం సూచనలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీప్రభుత్వ సమన్వయం, ప్రజలతో మరింతగా మమేకమై పనిచేయాల్సిన విధానం తదితర అంశాలపై జరిగిన శిక్షణా కార్యక్రమాల్లో



పాల్గొన్నారు.మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న వసంత కృష్ణప్రసాదు కాంక్లేవ్‌లో పార్టీ అధినాయకత్వం నుంచి పలు సూచనలు, మార్గదర్శకాలను స్వీకరించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రజాప్రతినిధుల పాత్రపై జరిగిన చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ లీడర్‌షిప్ కాంక్లేవ్ ద్వారా పార్టీ నాయకత్వం, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి నాయకుల మధ్య మరింత సమన్వయం పెంచడంతో పాటు రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

## గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన



**కడప సెప్టెంబర్ 08:** జిల్లా ఎస్పీ శ్రీ నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ వారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం గ్లోబల్ ఇంజినీరింగ్ కాలేజ్ నందు "పోలీస్-కళా-జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ నేతృత్వంలోని బృంద సభ్యులచే 'ఓయువతా... మేలుకో" నాటిక, పాటలప్రదర్శన ద్వారా "మాధకద్రవ్యాల"పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.డ్రగ్స్ కు అలవాటుపడటం వలన విద్య, ఆరోగ్యం, కుటుంబజీవితం, వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను ప్రదర్శన ద్వారా తెలియజేశారు.ఈసందర్భంగా చెన్నూరు సిఐ చాంద్ బాషా మాట్లాడుతూ ఈనాటి సమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై యువతలో చైతన్యం కల్పించడంతో పాటు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని, యువత దేశ భవిష్యత్ కు వెన్నెముకలాంటి వారని, మత్తుపదార్థాలకు ఆకర్షితులు కాకుండా, లక్ష్యసాధనపై దృష్టి సారించాలని సూచించారు. మత్తుపదార్థాలను వినియోగించడం, విక్రయించడం, రవాణా చేయడం లేదా వాటికి ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని, అలాంటి నేరాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తుపదార్థాలు అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని సూచించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ విజయరామిరెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులగా మేము మరియు మీతల్లిదండ్రులు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యశిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈగల్ టీమ్ గురుశేఖర్ విద్యార్థులచే "యువతా మేలుకో-మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు-జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం-భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు.

**"పోలీసు కళా-జాగృతి బృందం" ప్రదర్శన విద్యార్థులను అలరించింది.** ఈకార్యక్రమంలో కాలేజ్ హెచ్.ఓ.డి కృష్ణకిషోర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, కడప ఫ్యాక్షన్ జోన్ యస్.ఐ సుబ్రహ్మణ్యం మరియు కళాబృందం సభ్యులు సుశీల, మేషక్, ఉదయ్, శ్రీరామ్, మధు, కరుణాకర్ పాల్గొన్నారు.




# మెగా డీఎస్సీపై దుష్ప్రచారం తగదు

**148 రోజుల్లో 16,347 కొలువులు**
**మెరిట్‌కే ప్రాధాన్యం**
**నిరుద్యోగుల ఆశలకు రెక్కలు**
**డీఎస్సీపై రాజకీయ రగడ ఎందుకు..**
**పారదర్శక నియామకాలు -వైసీపీకి కంటగింపు!**
**మెరిట్ జాబితా నుంచి ఎంపిక వరకు..**
**అంతా బహిరంగమే..!!**
**నిరుద్యోగుల భవితతో రాజకీయం వద్దు**
**ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**అమరావతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక**మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరుద్యోగుల శ్రమను అవమానించేలా ఉన్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంతో మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో కేవలం 148 రోజుల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. నోటిఫికేషన్ నుంచి మెరిట్ జాబితాలు, ఆన్సర్ కీలు, గ్రీవెన్స్ పరిష్కారం వరకు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ 335 పిటిషన్లు దాఖలు చేయించిందని సౌమ్య ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో జాబ్ క్యాలెండర్ పేరుతో




నిరుద్యోగులను మోసం చేశారని విమర్శిస్తూ, కూటమి ప్రభుత్వం మెరిట్, పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు.

# స్వచ్ఛ గ్రామాలతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

**ప్లాస్టిక్‌కు దూరంగా.. పరిశుభ్రతకు చేరువగా ముందడుగు వేయాలి**
**పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం**
**స్వచ్ఛతా ర్యాలీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** స్వచ్ఛమైన గ్రామాల నిర్మాణంతోనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాకారమవుతుందని.. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు.ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో మంగళవారం జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొని గ్రామంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్రజలు, అధికారులు, సిబ్బందితో కలిసి నడిచారు. స్వచ్ఛతా ర్యాలీలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి.. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి.. చెత్తను సక్రమంగా నిర్వహించాలి అంటూ సందేశాలు ఇచ్చే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఉత్పత్తి అయ్యే చెత్తను సక్రమంగా వేరుచేసి నిర్వహించడం ద్వారా చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చని పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ మొక్కలు నాటారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, పునర్వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి నుంచే చెత్తను వేరు చేయడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్, క్లాత్ బ్యాగులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించి, గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన గ్రామాలను నిర్మించగలమని కలెక్టర్ తెలిపారు. ఇంటి పరిశుభ్రత నుంచి గ్రామ పరిశుభ్రత.. గ్రామ పరిశుభ్రత నుంచి ఆరోగ్యకరమైన సమాజం.. ఆరోగ్యకరమైన సమాజం నుంచి స్వర్ణాంధ్ర దిశగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీపీవో టి.సీతామహాలక్ష్మి, ఎంపీడీవో శకుంతుల, డీఎల్‌పీవో రాఘవన్, డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది

టీడీపీ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్నది 100 శాతం దుష్ప్రచారమేనని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ఈ తరహా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందని ఆయన ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ నుంచి నీటిని విడుదల చేయడంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో తమ ఓటు బ్యాంకుకు నష్టం జరుగుతుందనే భయం వైసీపీని వెంటాడుతోందని బోడే ప్రసాద్ అన్నారు. అందుకే ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ భుజానికెత్తుకున్నారని విమర్శించారు. డీఎస్సీలో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులపై కూడా అక్రమాలు జరిగాయంటూ ఒక పత్రికను అడ్డుపెట్టుకుని విష ప్రచారం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గంలోని ఇద్దరు అక్కాచెల్లెళ్ల ఉదంతాన్ని ఆయన ఉదహరించారు. సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్న ఆ యువతులు కష్టపడి చదివి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని, వారిలో ఒకరు 2019లో కేవలం ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత వారి కల నెరవేరితే, వారి మెరిట్‌ను కూడా ప్రశ్నిస్తూ వైసీపీ నేతలు అవమానించడం బాధాకరమన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలి




## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** జిల్లాలో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్. సమావేశ మందిరంలో మంగళవారం రీ సర్వేపై నిర్వహించిన రెవెన్యూ వర్క్ షాపులో జిల్లా కలెక్టర్ పాల్గొని, రీ సర్వేకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో ప్రతి దశను క్షుణ్ణంగా పరిశీలిస్తూ భూ రికార్డులను సక్రమంగా నవీకరించాలని సూచించారు. భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ, భూ యజమానుల వివరాలు, రికార్డుల పరిశీలన తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో చేపట్టిన రీ సర్వే పనుల వివరాలను, ప్రస్తుతం కొత్తగా చేపడుతున్న రీ సర్వే వివరాలను క్షుణ్ణంగా పోల్చి పరిశీలిస్తూ అవసరమైన సవరణలు చేపట్టాలని తెలిపారు. రీ సర్వే పనుల్లో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, భూ యజమానులకు వారి భూములకు సంబంధించిన వివరాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సంబంధిత రికార్డులు, క్షేత్రస్థాయి వివరాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వేలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఒకరికొకరు సహకరించుకుంటూ పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రీ సర్వే లాగిన్ లో తొలిదశగా భూముల క్షేత్రస్థాయి పరిశీలన, భూముల వివరాలను పటాల రూపంలో నమోదు చేయడం, వివరాల అనుసంధానం, విస్తీర్ణ విశ్లేషణ నివేదిక తయారీ, మార్పుల నమోదు, అదనపు సమాచారాన్ని నమోదు చేయడం వంటి ప్రక్రియలను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ సర్వేయర్ లాగిన్ లో భూమి హక్కు పత్రాల అనుసంధానం, మార్పుల వివరాల నమోదు, విలీనమైన పట్టణ ప్రాంతాల వివరాల నమోదు వంటి ప్రక్రియలు చేపట్టాలన్నారు. తదుపరి దశలో గ్రామ రెవెన్యూ అధికారి లాగిన్ లో మార్పుల నమోదు, భూమి స్వభావం, వర్గీకరణలో మార్పులు చేపట్టాలని, ఉప తహసీల్దార్ లాగిన్ లో మార్పుల కోసం ఎనిమిదో నమూనా పత్రం తయారు చేసి తహసీల్దార్‌కు పంపాలని సూచించారు. తహసీల్దార్ లాగిన్ లో భూమి హక్కు పత్ర సంఖ్య, విస్తీర్ణం, భూ వర్గీకరణ మార్పులతో పాటు సర్వే సంఖ్యల సవరణలు, చేర్పులు, తొలగింపులు చేపట్టాలని తెలిపారు. అనంతరం నోటీసుల జారీ, అభ్యంతరాల స్వీకరణ, అప్పీళ్ల పరిశీలన, విచారణ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేయడం, సమాచారాన్ని ధృవీకరించడం వంటి ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను జిల్లా స్థాయి కమిటీ ద్వారా పరిశీలించి, భూ రికార్డులను ప్రాజెక్టు నిర్వహణ బృందం ధృవీకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి దశలో తుది భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులకు పంపించడం, భూముల పటాలను నమోదు చేయడం, తహసీల్దార్ పరిశీలనకు పంపించడం, ఆమోదం పొందడం, ప్రత్యేక నిబంధనల పరిధిలోని భూముల వివరాలను ధృవీకరించడం, ఉన్నతాధికారుల పరిశీలనకు పంపించడం వంటి చర్యలను చేపట్టాలని తెలిపారు. ఆ తరువాత తుది భూ హక్కుల రిజిస్టర్ తయారీకి సంబంధించి ప్రకటన జారీ చేయడం, గ్రామసభ నిర్వహించడం, అభ్యంతరాలు స్వీకరించడం, వ్యక్తిగత విచారణలు నిర్వహించడం వంటి ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. చివరి దశలో తుది భూ హక్కుల రిజిస్టర్ వివరాలను ఆమోదించి, తుది సమాచారాన్ని నమోదు చేసి, గ్రామాలను తుది భూ హక్కు పత్రాల పంపిణీకి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్క్ షాప్ లో ఎవరైనా ఒకరు లేదా ఇద్దరు అధికారులు, సిబ్బంది హాజరు కాలేకపోయినట్లయితే, వారికి ప్రత్యేకంగా వారి పరిధిలో మరో సమావేశం నిర్వహించి రీ సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ, పూర్తి సమన్వయంతో పనిచేసి ఎలాంటి తప్పులకు తావులేకుండా డిసెంబర్ నాటికి రీ సర్వే పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇకపై జిల్లా జాయింట్ కలెక్టర్ లాగిన్‌ను తాను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తానని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇంత విస్తృతంగా వర్క్ షాప్ నిర్వహించి, రీ సర్వేపై పూర్తి అవగాహన కల్పించిన అనంతరం కూడా గతంలో మాదిరిగా అధిక సంఖ్యలో తప్పులు చేస్తూ పదేపదే సవరణలు చేపట్టే పరిస్థితి ఏర్పడితే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. పనుల నాణ్యత, ఖచ్చితత్వం విషయంలో అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే పనుల పురోగతిని మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న సర్వే పనుల నాణ్యతను అధికారులు స్వయంగా పరిశీలించాలని, కేవలం నమోదైన వివరాల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రీ సర్వేలో ప్రతి దశను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా మండలాల వారీగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా రికార్డుల్లో ఉన్న వివరాలు, క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాల మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి నిబంధనల ప్రకారం సరిచేయాలని తెలిపారు. భూ యజమానులకు సంబంధించిన వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రీ సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తూ, నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ. పి. గ్లోరియా, ఆర్.డి.ఓలు సూర్యనారాయణ, దాస్‌రాజు, కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ పి. ప్రభాకర్, జిల్లా సర్వే అధికారి కె. జాషువా, మండల తహసీల్దార్లు, సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, కలెక్టరేట్ పి.ఎం.యు. బృందం, ఈ-జిల్లా నిర్వాహకులు, ఈ-డివిజన్ నిర్వాహకులు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



# నరసాపురం నియోజకవర్గం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమీక్ష.




### ప్రజల అభిప్రాయాలే పాలనకు ప్రామాణికం.

### నరసాపురం నియోజకవర్గంలో సానుకూల ప్రజాభిప్రాయం మరింత బలోపేతం చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** ప్రజలకు సేవలను అందించడంతోపాటు, అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీలుసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం, ఎస్. ఆర్. కె.ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై శాఖల వారీగా జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, పి జి ఆర్ ఎస్ మోడల్ అధికారి వై దోసిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొని నియోజకవర్గంలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ** ప్రజల అభిప్రాయాలే పాలనకు ప్రామాణికమని అన్నారు. నియోజకవర్గం లోని మండల, గ్రామ స్థాయిలో సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని అన్నారు. సమస్య తీవ్రత ను బట్టి వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు. గ్రామాల్లో, వార్డులలో విఆర్వోలు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. మండల స్థాయి అధికారులు తమకు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలు, వసతి గృహాలను తరచూ సందర్శించి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అక్కడ శానిటేషన్, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పరిశీలించి, ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజలకు సేవలు అందించిన తరువాత అవి వారికి సక్రమంగా అందుతున్నాయా, ఉపయోగకరంగా ఉన్నాయా లేదా అడిగి తెలుసుకోవాలని అన్నారు. అధికారుల పనితీరును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును మరింత సమర్థవంతంగా మెరుగుపరచవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలు ఏమిటి అనే అంశాలను అధికారులు నిరంతరం పరిశీలించాలన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి ఉంచాలని అన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు పథకాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అర్హతలు, దరఖాస్తు విధానం, అందే ప్రయోజనాలపై సంబంధిత శాఖల అధికారులు తెలియజేయాలన్నారు. నరసాపురం నియోజకవర్గంలో జరుగుతున్న రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్య, వైద్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు దృష్టి సారించి ప్రజలకు తెలిసే విధంగా అభివృద్ధిని చూపాలని అన్నారు. ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం లభించినప్పుడే ప్రభుత్వంపై ప్రజల్లో మరింత విశ్వాసం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రతి శాఖకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన సమస్యలను ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయో లేదో తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిని అన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలు తెలుసుకోవాలని పేర్కొన్నారు.

**ఆర్డీఓకు కలెక్టర్ ఆదేశాలు** నరసాపురం నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలో, అంగనవాడి కేంద్రాలు, వసతి గ్రహాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్ డి ఓ ను, జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలలో అమలవుతున్న నవచేతన కార్యక్రమాన్ని యంపిడిఓ, యం ఆర్ ఓ లు, అధికారులు తరచూతరచూ పర్యవేక్షించాలన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది మధ్య సమన్వయం పెంచి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. తదుపరి సమావేశం నాటికి జిల్లా అధికారులు తమ పనితీరును వెలుగుపరచుకొని, నియోజకవర్గ స్థాయిని పెంచాలని తెలియజేశారు. ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు, త్రాగునీరు, సీటింగ్ ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలను ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ పనితీరు మెరుగుపరచుకొని ప్రజలకు నిస్వార్థ సేవలను అందించాలని అధికారులకు తెలిపారు. నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాఖలన్ని సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించాలని తెలిపారు.. సమావేశంలో నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై దోసి రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గానికి సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై 80% సబ్సిడీ:ఏ.ఓ. స్వాతి

**వెలుగోడు సెప్టెంబర్ 08నంది పత్రిక:** నీటి ఎద్దడి దృష్ట్యా రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి సూచించారు. మంగళవారం మోత్కూర్ మాధవరం రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తోందని, వెలుగోడు మండలానికి 275 క్వింటాళ్ల మినుము, కొర్ర విత్తనాలు కేటాయించినట్లు తెలిపారు. సబ్సిడీ ధరలు: మినుము (4 కేజీలు): ₹104 కొర్ర (4 కేజీలు): ₹24 పొలాలు ఖాళీగా ఉన్న రైతులు ఆధార్ కార్డు, పాస్‌బుక్ వివరాలతో వెంటనే సమీప రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, ఆర్ఎస్కే సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## గుత్తి రోడ్డులో మురుగు కాలువ దుర్వాసన..

# ప్రజల అవస్థలు!

### అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**డోన్,నంది పత్రిక సెప్టెంబర్ 8:** డోన్ పట్టణంలోని గుత్తి రోడ్డులో మురుగు కాలువ నుంచి వెలువడుతున్న తీవ్రమైన కంపు వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలో మురుగునీరు పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోందని, పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, రహదారిపై రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం, మురుగునీరు సక్రమంగా ప్రవహించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొంటున్నారు. దుర్వాసన కారణంగా ప్రజలు ఇళ్లలో ఉండేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారని, పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువను పరిశీలించి, పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించి శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఖాజీపేటలో గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 08** ఖాజీపేట అయ్యప్ప స్వామి ఆలయంలో మండల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 100 మంది గణేష్ మండపాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ కో-కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు దేవకి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి రామ్ మహేష్, సీఐ వంశీధర్ పాల్గొని ఉత్సవాల నిర్వహణ, ప్రభుత్వ అనుమతులు, శాంతిభద్రతలపై సూచనలు చేశారు. మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న సింగిల్ విండో అనుమతుల యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మండల గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మద్దూరి హరి భాస్కర్ రెడ్డి, వెంకటేష్, కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## మహిళలను నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలి:

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** జిల్లాలో మహిళలను నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో 60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు విద్యను అభ్యసించినప్పుడే సమాజంలో సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతి మహిళ చదువుకోవాలని సూచించారు. జిల్లాలో 52వేల700 మంది నిరక్షరాస్య మహిళలను గుర్తించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు చెందిన మహిళలు, జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మహిళలను నూరు శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన నిరక్షరాస్య మహిళలకు విద్యను నేర్పించేందుకు 5,280 మంది వాలంటీర్లను నియమించడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచే నిరక్షరాస్య మహిళలకు తరగతులు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మహిళలకు చదవడం, రాయడం చక్కగా నేర్పించడంతో పాటు, వారికి అవసరమైన ప్రాథమిక విద్యను అందించాలని వాలంటీర్లకు సూచించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు జిల్లా కలెక్టర్ అధ్యయన సామగ్రిని అందజేశారు. అనంతరం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి కె.వి.వి. సత్యనారాయణ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ హెప్సిబా, డ్వామా ఏ.పి.డి. స్వాతి పాల్గొన్నారు.






# శత శాతం అక్షరాస్యతే ధ్యేయం






## ‘అక్షరాంధ్ర’ కార్యక్రమంతో ఎన్టీఆర్ జిల్లాను శతశాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దుతాం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** జిల్లాను శతశాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ, సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ కె.బి.ఎన్. కళాశాలలో 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామూహిక వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, అక్షరాస్యత అనేది కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడమే కాకుండా వ్యక్తి సామాజిక, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధికి కీలకమైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ అక్షరాస్యత అందేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ‘అక్షరాంధ్ర’ కార్యక్రమంలో భాగంగా 202526 సంవత్సరానికి 97,047 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించగా, 96,686 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది 99 శాతం అక్షరాస్యతను సాధించినట్లు కలెక్టర్ వెల్లడించారు. 202627 సంవత్సరానికి సంబంధించి 88,890 మంది నమోదు లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మిగిలిన వారిని కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాను శతశాతం అక్షరాస్యత దిశగా తీసుకెళ్లేందుకు నిరంతర కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్షరాస్యత కార్యక్రమాల అమలులో క్షేత్రస్థాయి సిబ్బంది, విద్యాశాఖ, వయోజన విద్యా విభాగం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సమాజంలోని వివిధ వర్గాల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సాధారణ అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత కూడా ప్రతి ఒక్కరికీ అవసరమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు, సమాచార సాంకేతికతను సద్వినియోగం చేసుకునేందుకు డిజిటల్ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు డిజిటల్ పరిజ్ఞానం కలిగి ఉండేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. “అక్షరాస్యత ప్రాముఖ్యత ప్రతి ఒక్కరి బాధ్యత” అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు, అలాగే “డిజిటల్ యుగంలో డిజిటల్ అక్షరాస్యత” అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విజేత విద్యార్థులను అభినందించిన కలెక్టర్, అక్షరాస్యత ప్రాముఖ్యతను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయడంలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ఇతరులు అక్షరాస్యత ఉద్యమ ప్రతిజ్ఞ చేశారు. జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి అక్షరాస్యత అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ, ఐసీడీఎస్ పి.డి ఎస్.కె రుక్సానా, వయోజన విద్యాశాఖ డి.డి జి.ప్రభాకర్, ఏ.డి. హాజీ బేగ్, సీడీఓ శ్రీకాంత్, హెచ్ఎం హనుమంతరావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జి.ప్రసాదరావు, ఎం.సింగయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు మరిన్ని సేవలు

### నూతన వాహన సర్వీసింగ్ సదుపాయాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు,




**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహిస్తున్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌లో అదనపు వాహన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు హెచ్‌పీసీఎల్ అథారిటీ ఆర్ఎం ఓ అభిషేక్ ప్రతాప్ సింగ్ తో కలిసి ఈ నూతన సేవలను ఈరోజు అధికారికంగా ప్రారంభించారు. ఇకపై పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌లో కేవలం పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ సేవలకే పరిమితం కాకుండా, వాహనదారుల సౌకర్యార్థం వీల్ అలైన్‌మెంట్, వాహనాలకు సంబంధించిన చిన్నచిన్న మరమ్మతులు, సర్వీసింగ్‌కు సంబంధించిన అవసరమైన ఇతర సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. వాహనదారులు తమ వాహనాలకు అవసరమైన ప్రాథమిక సర్వీసులు, చిన్నపాటి మరమ్మతుల కోసం ప్రత్యేకంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఒకే ప్రదేశంలో సౌకర్యవంతంగా సేవలు పొందే విధంగా ఈ సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖ అందించే సేవలను మరింత విస్తృతం చేసి, వాహనదారులకు నాణ్యమైన మరియు సౌకర్యవంతమైన సేవలు, సరసమైన ధరలలో వేగవంతమైన సర్వీస్ అందించడమే లక్ష్యంగా ఈ అదనపు సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌పీసీఎల్ అధికారుల సహకారంతో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ నూతన సేవలు ప్రజలకు, వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, హెచ్‌పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ గంగా ప్రసాద్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

### 11వ డివిజన్‌లో మొక్కలు నాటిని ఎమ్మెల్యే గద్దె రామమోహన్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8 నంది పత్రిక** ప్రతి ఒక్కరు అవకాశం ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, బొప్పన భవకుమార్ హజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ పారిశ్రామికవాడగా పేరుపొందిన ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటాల్సిన అవసరం చాలా ఉందన్నారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడంలో చెట్లు కీలకమని అన్నారు. నీడను, చల్లని గాలిని కోరుకునే వారందరూ తప్పకుండా మొక్కలు నాటాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటాలని సూచించారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. భూమి సారవంతం కావాలన్నా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. రావి శ్రవంత్ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలా ఛైర్మన్ అన్నే శివ నాగేశ్వరరావు, వైస్ ఛైర్మన్ సుంకర దుర్గా ప్రసాద్, సభ్యులు పంచుమర్తి ప్రసాద్, సత్తిగ శివ నాగేశ్వరరావు, అబ్దుల్ కలామ్, రావి శ్రీనివాసరావు, నాదెళ్ల రాజేష్, కోనేరు రాజేష్, చలసాని రమణ, యెర్నేని వేదవ్యాస్, కిలారు శ్రావణ్, జాస్తి సురేష్ పాల్గొన్నారు.



## మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత: డీఈవో జనార్ధన్ రెడ్డి



**మహానంది సెప్టెంబర్ 08 (నంది పత్రిక):–** ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగుతూ, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలలో తాగునీటి అవసరాల కోసం ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా అందజేసిన నీటి మోటార్‌కు డీఈవో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. ఉపాధ్యాయుల సేవా నిరతిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ జగన్మోహన్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు రామసుబ్బయ్య, విజయ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మహానంది క్షేత్రంలో వైభవంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం

**మహానంది సెప్టెంబర్ 08 (నంది పత్రిక):–** నందీశ్వరుడు జన్మించిన పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన మహానందిలో శ్రావణ బహుళ త్రయోదశి (ప్రదోష సమయం) పురస్కరించుకుని నందీశ్వరాభిషేకం మహా వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.మహాప్రదోష కాల పూజల్లో భాగంగా ఆలయంలో తొలుత గణపతి పూజ, పీఠార్చన, ఉపదేవతార్చనలను అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు.అనంతరం పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన ప్రదోష సమయంలో నందీశ్వరునికి విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకార్చనలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు



## నీటిని వృధా చేయవద్దు

### వినాయక మండపాలలో మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోండి -ఆళ్లగడ్డ తహాశీల్దార్ జ్యోతి రత్నకుమారి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 8 నంది పత్రిక** ఎలినో ప్రభావం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రిజర్వాయర్ ల నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేసిన నీటిని ప్రజలు వృధా చేయవద్దని ఆళ్లగడ్డ తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి విజ్ఞప్తి చేశారు. ఆమె మంగళవారం కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో భాగంగా పల్లెల్లో మూడోదినం పట్టణాల్లో ఐదవ రోజు నిమజ్జన వేడుకలు నిర్వహిస్తారన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం విడుదలైన నీటిలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాలు వేసి నీటిని కలుషితం చేయవద్దని సూచించారు. పోలీస్ అధికారులు సూచించిన మేరకు కొలువుంచిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలో పడకండ్ల బ్రిడ్జి వద్ద విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. ఆళ్లగడ్డ పట్టణ శివారులో ఉన్న గని గుంతల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వెనుకాడమన్నారు. గని గుంతల వద్ద విగ్రహాలు నిమజ్జనం చేయకుండా బోర్డు ఏర్పాటు చేయాలని ఆళ్లగడ్డ మున్సిపల్ అధికారులకు సూచించామన్నారు. గని గుంతల వద్ద విగ్రహాలు నిమజ్జనం చేయడం ప్రమాదకరమని ఉత్సవ సమితి వారు మండప నిర్వాహకులు గుర్తించి పడకండ్ల బిజీ వద్దనే ఆళ్లగడ్డ కు చెందిన వారు నిమజ్జనానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలు నీటి అవసరాన్ని గుర్తించి పోలీసులకు రెవెన్యూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పడకండ్ల బ్రిడ్జి వద్ద వకులా నదిలో నిమజ్జనం నాటికి నీరు లేనట్లయితే అగ్నిమాపక సిబ్బంది విగ్రహాలను నీటితోనే పైపు ద్వారా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ పూర్తిస్థాయిలో కరిగిపోయేలా చేస్తారని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు కాకుండ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకొని ఆళ్లగడ్డ ప్రాంత వాసులు ఆదర్శంగా నిలవాలని జ్యోతి రత్నకుమారి సూచించారు. ఎత్తు తక్కువ ఉన్న విగ్రహాలు ఏర్పాటు చేసినట్లయితే నిమజ్జనంలో దారి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగవచ్చునని సూచించారు. రంగులు రసాయనాలు వాడని మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జ్యోతి రత్నకుమారి పిలుపునిచ్చారు.

## యూట్యూబర్ ‘నందు’కు నోటీసులు..

చీటింగ్ కేసుకు సంబంధించి యూట్యూబర్, ‘నందూస్ వరల్డ్’ యూట్యూబ్ చానల్ నిర్వాహకురాలు నందనకు సోమవారం నోటీసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం ‘బీబీసీ’తో చెప్పారు. యూకేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యువల్ చేస్తామని పలువురిని మోసగించారంటూ నందన, ఆమె భర్త మధుకర్, ఆయన తండ్రి మోహన్ రావుపై గత ఏడాది నవంబర్‌లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుకు సంబంధించి అప్పట్లో లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం లండన్ నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన నందనని ఎయిర్‌పోర్ట్ ఇమిగ్రేషన్ పోలీసులు అడ్డుకుని ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం పంపించారు. వెస్ట్ జోన్ ఏసీపీ దుర్గారావు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని ఆమెకు 35 బీఎన్ఎస్ నోటీసులు అందించినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రెండు రోజుల్లో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆమెపై నమోదైన కేసులకు సంబంధించి వివరణ ఇవ్వాలని ఆ నోటీసులు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. నోటీసులు తీసుకుని ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ఆయన బీబీసీతో చెప్పారు.

## ప్రమాదంలో గాయపడిన వారిని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 08** మంగళవారం ఐ టీ ఐ కళాశాల ఎదురుగా జరిగిన ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని సుజాతమ్మ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి, మెరుగైన వైద్యం మరియు అవసరమైన వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు.ఈ సందర్భంగా బాధితులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రమాద ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అత్యవసర సమయంలో బాధితులకు అండగా నిలిచి, వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధిత అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సుజాతమ్మ భరోసా ఇచ్చారు.

# నైపుణ్యానికి ఉద్యోగం.. ప్రతిభకు అవకాశం.. ధర్మవరంలో మెగా జాబ్ మేళా ఘన విజయం









**మెగా జాబ్ మేళాకు భారీగా తరలివచ్చిన నిరుద్యోగ యువత**

**ధర్మవరంలో 135 కంపెనీలతో మెగా జాబ్ మేళా 1,146 మందికి పైగా ఉద్యోగాలు**

**ధర్మవరంలో ఉద్యోగాల జాతర.. 1,146 మందికి పైగా యువతకు కొలువులు**

**యువత భవిష్యత్తుకు తొలి మెట్టు ఉద్యోగం.. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని జీవితంలో ఎదగాలి మంత్రి సత్యకుమార్ యాదవ్**

**జాబ్ మేళా ఒక్కరోజు కార్యక్రమం కాదు.. ధర్మవరం యువతకు ఉద్యోగాలు కల్పించే నిరంతర ప్రక్రియ సత్యకుమార్ యాదవ్**

**ఉద్యోగం కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.. కంపెనీలనే ధర్మవరానికి తీసుకొస్తాం మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ధర్మవరం యువతకు ఉపాధి అవకాశాల గమ్యస్థానంగా సత్యసాయి జిల్లా జి. సతీష్ రెడ్డి**

**రాబోయే రోజుల్లో సత్యసాయి జిల్లాలో వేలాది ఉద్యోగ అవకాశాలు జి. సతీష్ రెడ్డి**

**నైపుణ్యంతో సిద్ధమైతే జిల్లాలోనే వేలాది ఉద్యోగ అవకాశాలు కలెక్టర్ శ్యాంప్రసాద్**

**నైపుణ్యం, ప్రతిభ ఉంటే ఉద్యోగం ఖాయం.. యువతకు కలెక్టర్ శ్యాంప్రసాద్**

**ధర్మవరం, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8: నంది పత్రిక** ధర్మవరం పట్టణంలోని సిఎన్బీ ఫంక్షన్ హాల్‌లో సంస్కృతి సేవా సమితి సహకారంతో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖా ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్, మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి. సతీష్ రెడ్డి, సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ జాబ్ మేళాలో 135 ప్రతిష్టాత్మక కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురాగా, నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వచ్చిన 4,100 మంది యువతలో 1,146 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ధర్మవరం నియోజకవర్గంలో యువతకు విద్య, నైపుణ్యం, ఉద్యోగ అవకాశాలను అందించాలన్న సంకల్పంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం యువత చదువుకోవడానికి అవసరమైన విద్యా సంస్థలు, ఆయుర్వేద మెడికల్ కాలేజీ, ఇతర విద్యా అవకాశాలతో పాటు చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గతంలో మెగా జాబ్ మేళాతో పాటు చిన్న స్థాయిలో అనేక జాబ్ మేళాలను నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పించామని, ప్రస్తుతం నిర్వహిస్తున్నది రెండో మెగా జాబ్ మేళా అని వివరించారు. గతంలో 2025 జనవరి 9న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 102 కంపెనీలు పాల్గొనగా, 5,200 మంది అభ్యర్థులు హాజరై 2,400 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు మంత్రి గుర్తుచేశారు. ఈసారి మరింత పెద్ద స్థాయిలో జాబ్ మేళా నిర్వహించాలన్న ఉద్దేశంతో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, జిల్లా అధికార యంత్రాంగం, సంస్కృతి సేవా సమితి, పారిశ్రామిక సంస్థల సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేశామని తెలిపారు. టీసీఎస్, యాక్సెంచర్, క్యాప్‌జెమినీ, హెచ్‌సీఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కియా ఇండియా, టాటా మోటార్స్, ఫాక్స్‌కాన్, హ్యుందాయ్ మొబిస్, అరబిందో ఫార్మా, హెటిరో, అపోలో ఫార్మసీస్, డీమార్ట్ తదితర ప్రతిష్టాత్మక సంస్థలు జాబ్ మేళాలో పాల్గొనడం ధర్మవరం యువతకు లభించిన గొప్ప అవకాశమని మంత్రి తెలిపారు. ఐటీ, ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్, ఫార్మా, ఆటోమొబైల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బ్యాంకింగ్, ఫైనాన్స్ తదితర రంగాలకు చెందిన సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లకుండా తమ సొంత ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలను పొందేలా చేయడమే లక్ష్యమని చెప్పారు. “ఉద్యోగం అంటే కేవలం జీతం కాదు.. అది మన భవిష్యత్తుకు తొలి మెట్టు” అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. తన జీవితంలోని వివిధ దశల్లో చిన్నచిన్న ఉద్యోగాలు, పనుల ద్వారా ఎన్నో నైపుణ్యాలను నేర్చుకున్న విషయాన్ని యువతకు ఉదాహరణగా వివరించారు. పదో తరగతి తర్వాత ప్రింటింగ్ ప్రెస్‌లో ప్రూఫ్ రీడింగ్ చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు, ఇంటర్మీడియట్ తర్వాత చార్టర్డ్ అకౌంటెంట్ వద్ద పనిచేయడం ద్వారా ఫైనాన్స్, స్టాక్ మార్కెట్‌పై అవగాహన, పాలిటెక్నిక్ తర్వాత బెంగళూరులో సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేయడం ద్వారా సాంకేతిక నైపుణ్యం సంపాదించానని తెలిపారు. “ఒక్కసారిగా పెద్ద స్థాయికి వెళ్లలేం.. ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు సాగాలి. వచ్చిన ప్రతి ఉద్యోగం మనకు ఏదో ఒకటి నేర్పుతుంది” అని యువతకు సూచించారు. ఉద్యోగం వచ్చిన వెంటనే నచ్చలేదని వదిలేయకుండా కనీసం కొంతకాలం అనుభవం సంపాదించాలని, సంస్థలోనే ఎదగడానికి ప్రయత్నించాలని మంత్రి కోరారు. ఖాళీ సమయాన్ని సోషల్ మీడియా, రీల్స్‌తో వృథా చేయకుండా భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని సూచించారు. నైపుణ్య శిక్షణతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ పెంచుకోవాలని, ఉద్యోగం కోసం అవసరమైతే సొంత ఊరు దాటి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి కూడా యువత సిద్ధంగా ఉండాలని అన్నారు. ధర్మవరం, సత్యసాయి జిల్లా భవిష్యత్తులో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందబోతున్న ప్రాంతమని మంత్రి తెలిపారు. జిల్లాలో రక్షణ, ఏరోస్పేస్, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఫార్మా తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రాబోయే రోజుల్లో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సత్యసాయి జిల్లాలో ఏర్పాటు కానున్న పారిశ్రామిక పార్కులు, రక్షణ రంగ పరిశ్రమలు, పుట్టపర్తి ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ కార్యకలాపాలు, ధర్మవరం మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ వంటి అవకాశాలను యువత ఇప్పటి నుంచే గుర్తించి తగిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, పీఎం విశ్వకర్మ తదితర కార్యక్రమాల ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి, రుణాలు, పరిశ్రమలు స్థాపించే అవకాశాలు అందుతున్నాయని మంత్రి వివరించారు. ఉద్యోగం కోసం ఎదురుచూడటంతో పాటు అవకాశాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్మించేది యువతేనని మంత్రి అన్నారు. భారతదేశ యువ జనాభా బలాన్ని సరైన దిశలో వినియోగిస్తే ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా భారత్ ఎదగగలదని తెలిపారు. “మీ మీద మీరు నమ్మకం పెట్టుకోండి.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి.. వ్యసనాలకు దూరంగా ఉండండి.. ఏ పరిస్థితుల్లోనూ నిరాశకు లోనుకాకండి” అని యువతకు సందేశమిచ్చారు. కష్టపడే వయసు ఇదేనని, ఈరోజు పడే కష్టం రేపటి జీవితానికి బలమైన పునాది అవుతుందని చెప్పారు.

**మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ...** ఒక నియోజకవర్గంలో రెండేళ్ల వ్యవధిలో రెండోసారి ఇంత భారీ స్థాయిలో జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. సత్యకుమార్ యాదవ్‌తో తనకు సుమారు 35 సంవత్సరాల అనుబంధం ఉందని, ఆయన నిరంతరం కష్టపడే వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాపై కంపెనీలు చూపిన ఆసక్తి కారణంగా దాదాపు 200 కంపెనీల వరకు రావడానికి సిద్ధమైనప్పటికీ, అందరికీ అవకాశం కల్పించే విధంగా దశలవారీగా మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించవచ్చని తెలిపారు. టీసీఎస్, యాక్సెంచర్, క్యాప్‌జెమినీ వంటి పెద్ద సంస్థలు ధర్మవరానికి వచ్చి యువతను నేరుగా ఎంపిక చేయడం ఒక అద్భుతమైన అవకాశమని అన్నారు. సత్యసాయి జిల్లా రాబోయే పదేళ్లలో దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక జిల్లాల్లో ఒకటిగా ఎదగబోతోందని జి. సతీష్ రెడ్డి తెలిపారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, రక్షణ రంగ పరిశ్రమలు, ఏరోస్పేస్ ప్రాజెక్టులు, ఇతర భారీ పెట్టుబడులు జిల్లాకు రావడం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు ఏర్పడబోతున్నాయని చెప్పారు. ప్రపంచ స్థాయి రక్షణ రంగ తయారీ సామర్థ్యాన్ని పెంచే దిశగా పుట్టపర్తి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి సత్యసాయి జిల్లాకు గొప్ప అవకాశం అని వివరించారు. ఇన్ని పరిశ్రమలు వస్తున్న సమయంలో స్థానిక యువత నైపుణ్యాలను పెంచుకుని ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.** సత్యసాయి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం నుంచి పారిశ్రామిక, ఉపాధి కేంద్రంగా రూపాంతరం చెందుతోందన్నారు. కియా పరిశ్రమ రాకతో ఆటోమొబైల్ రంగంలో అనుబంధ పరిశ్రమలు ఏర్పడి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరిగాయని తెలిపారు. రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్ తదితర రంగాల్లో భారీ పెట్టుబడులు వస్తున్న నేపథ్యంలో జిల్లాలో యువతకు మరింత విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. యువతకు విద్యార్హతతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఉద్యోగం వచ్చిన వెంటనే కొన్ని రోజుల్లోనే వదిలిపెట్టకుండా కనీసం ఆరు నుంచి ఏడు నెలలు పనిచేసి అనుభవం సంపాదించాలని, ఆ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని కెరీర్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా చదువును కొనసాగిస్తూ డిగ్రీ తర్వాత ఎంబీఏ, ఎంసీఏ, ఇతర కంప్యూటర్ కోర్సులు వంటి అదనపు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. జాబ్ మేళాలో జరుగుతున్న ఇంటర్వ్యూలను మంత్రి సత్యకుమార్ యాదవ్, జి. సతీష్ రెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్ స్వయంగా పరిశీలించి, వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. ఉద్యోగాలకు ఎంపికైన యువతకు మంత్రి సత్యకుమార్ యాదవ్, జి. సతీష్ రెడ్డి నియామక పత్రాలు అందజేసి వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆకాంక్షించి అభినందించారు. జాబ్ మేళాలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన సంస్కృతి సేవా సమితి, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా అధికారులు, ఉపాధి కల్పన శాఖ, వివిధ పారిశ్రామిక సంస్థలు, నిర్వాహకులు, స్వచ్ఛంద కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు మరియు భారీగా తరలివచ్చిన యువతకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చివరగా ధర్మవరంలో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన ఒక్క జాబ్ మేళాతో ముగిసే కార్యక్రమం కాదని, భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో కంపెనీలను తీసుకొచ్చి, నైపుణ్య శిక్షణతో అనుసంధానం చేసి, 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ప్రతి విద్యార్థికు తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతర కృషి కొనసాగుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి సేవాసమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, జేడీఎం సీడ్ యాప్ గీతా రాణి, డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ హరికృష్ణ, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ధర్మవరం ఎమ్మార్వో దేవరాజ్, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పాండు, బిజెపి నాయకులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు...



## డోన్ లో పశువుల దాన పంపిణీ



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ :08** పాడి సంపద పెంపొందించే దృష్టిలో ప్రభుత్వం 50% రాయితీతో పాడి పశువులకు సమీకృత దాణా సరఫరా చేస్తుంది. స్థానిక ప్రాంతీయ పశు వైద్యాశాల డోన్ లో పాడి రైతులకు మంగళవారం రోజు డాక్టర్, నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ డోన్ వారు దాణాను రైతులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రఫీ ఎల్ ఎస్ ఏ కృష్ణ ఓ ఎస్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు. డాక్టర్. ఆర్. నాగరాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ 50 కేజీల దాణాను సంచి పూర్తి ఖరీదు రూ. 1110/- సబ్సిడీ పోను రైతు చెల్లించవలసినది 555/రూపాయలు. ఈ యొక్క దాణాలో 20% మాంసకృతులు ఉంటాయి, కాబట్టి పాడి పశువులకు పెట్టడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. రైతులు గుర్తించుకోవాల్సిన విషయంలో ఈ దాణా పెళ్ళేట్ (గులికల) రూపంలో ఉంటుంది. కాబట్టి పశువులకు వేసేటపుడు గంట ముందు నానబెట్టి పెట్టాలి. పెయ్య దూడల ఉత్పత్తి పథకం పై పాడి రైతుల అవగాహన సదస్సు రాష్ట్రంలో మేలు జాతి పెయ్య దూడలు ఉత్పత్తికి ప్రభుత్వము మార్పులు తీసుకొచ్చింది. పశు సంపదను గణనీయంగా వృద్ధి చేయడము, పాల ఉత్పత్తి పెంచడం లక్ష్యంగా లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్ పంపిణీ ప్రారంభించడం జరిగింది. గేదెలు, ఆవులు పెయ్య దుడలకు మాత్రమే పుట్టెల చేయడం దీని ఉద్దేశం, రైతులు కేవలం 150 రూపాయలు ప్రభుత్వ లింగ నిర్ధారిత వీర్యాన్ని అందిస్తుంది. గతంలో సాధారణ వీర్యం వల్ల మగ, ఆడ దూడలు దాదాపు సమాన సంఖ్యలో పుట్టేవి. లింగ నిర్ధారిత వీర్యాన్ని ఇంజక్షన్ల ద్వారా ఎక్కిస్తే 90% పెయ్య దూడలు పుట్టేందుకు అవకాశం ఉంటుంది. పెయ్య దూడ పెరిగి మూడున్నర ఏళ్లకు గర్భం దాల్చిన నాటికి దాని విలువ లక్షకు చేరుతుంది. అప్పటినుంచి ఏటా ఒక్క పేయ దూడను ఈనుతుంది. పాల ఉత్పత్తి పెరుగుతుంది.

## లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**మంగళగిరి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 8: నంది పత్రిక**

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజు నిర్వహించిన ప్రతిష్టాత్మక లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ప్రారంభమైన ఈ కాంక్లేవ్ మంగళవారం రెండో రోజు జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ తో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలు, పార్లమెంట్ పరిశీలకులు, పార్టీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు ఈ కాంక్లేవ్‌లో పాల్గొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల్లో నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించడం, పార్టీప్రభుత్వ సమన్వయాన్ని బలోపేతం చేయడం, ప్రజలతో మరింతగా అనుసంధానం కావడం ప్రధాన లక్ష్యాలుగా కాంక్లేవ్‌ను నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భవన్‌లోని టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పార్టీప్రభుత్వ సమన్వయంపై దిశానిర్దేశం** రెండు రోజుల పాటు నిర్వహించిన కాంక్లేవ్‌లో ప్రజాప్రతినిధుల పనితీరు, పార్టీప్రభుత్వ సమన్వయం, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధానం, పార్టీ కేడర్‌తో సమన్వయం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం వంటి కీలక అంశాలపై శిక్షణా తరగతులు, చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో సుస్థిర అభివృద్ధి ప్రజా సేవలు సుపరిపాలన పొలిటికల్ కమ్యూనికేషన్ ఎల్ నినోపైరానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధానం, పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపైనా నాయకులకు దిశానిర్దేశం చేశారు. కాంక్లేవ్ రెండో రోజైన మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ అధినాయకత్వం సూచనలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, నియోజకవర్గ స్థాయిలో పార్టీప్రభుత్వ సమన్వయం, ప్రజలతో మరింతగా మమేకమై పనిచేయాల్సిన విధానం తదితర అంశాలపై జరిగిన శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, పార్టీ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కాంక్లేవ్‌లో పార్టీ అధినాయకత్వం నుంచి పలు సూచనలు, మార్గదర్శకాలను స్వీకరించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ప్రజాప్రతినిధుల పాత్రపై జరిగిన చర్చల్లో ఆయన పాల్గొన్నారు. ఈ లీడర్‌షిప్ కాంక్లేవ్ ద్వారా పార్టీ నాయకత్వం, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి నాయకుల మధ్య మరింత సమన్వయం పెంచడంతో పాటు రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో నా తోటి మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి అనుభవాలను ఆత్మీయంగా పంచుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు



# మరోసారి ఐదుగురిపై జిల్లా బహిష్కరణ ఉత్తర్వుల జారి

**కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ . సిరి, ఐఏఎస్**

**కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో షరీన్ నగర్ నందు నివాసముండే

**కిరాయి హంతకుడు షీట్ నెంబర్ . 1 అయిన**

1.వడ్డే రామాంజనేయులు ఏ వడ్డే అంజి మరియు
2.వడ్డే తులసి కుమార్, రౌడీ షీట్ నెంబర్ 389,
3.వడ్డే రేవంత్ కుమార్, రౌడీ షీట్ నెంబర్ 387,
4.వడ్డే శివ కుమార్, రౌడీ షీట్ నెంబర్ 388
5.సస్పెక్ట్ షీటర్ 216 అయిన పఠాన్ ఇమ్రాన్ ఖాన్

అనే ఈ ఐదుగురు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అలవాటు పడిన వీరి ఐదుగురి పై కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ . సిరి, ఐఏఎస్ జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు వడ్డే రామాంజినేయులు ఏ వడ్డే అంజి మీద జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ లలో 17 కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి.వడ్డే రేవంత్ కుమార్ వడ్డే శివ కుమార్ వడ్డే తులసి



కుమార్ ల మీద 5 కేసులు నమోదు కాబడినవి.అదే విధంగా మరొక వ్యక్తి అయిన పఠాన్ ఇమ్రాన్ ఖాన్ మీద కూడా సుమారు 19 క్రిమినల్ కేసుల్లో నిందితుడు గా ఉన్నాడు.అందులో హత్యలు, దోపిడీలు, ఎస్సీ ఎస్టీ వర్గాల మీద దాడులు, జులుం కేసులు, హత్యాయత్నం కేసులు ఇలా పలు రకాల కేసులు నమోదయి ఉన్నాయి పలుమార్లు వీరి పై తెలిపిన కేసుల్లో రిమాండ్కు వెళ్లినా కూడా వారిలో ఎటువంటి మార్పు రాకపోవడం, మరియు అదేవిధంగా 2022 వ సంవత్సరంలో వడ్డే ఆంజనేయులు, ఇమ్రాన్ ఖాన్ లు పీడీ యాక్ట్ నిర్భంద ఉత్తర్వుల కింద కడప సెంట్రల్ జైల్లో ఖైదు చేయబడినప్పటికీ వీరి ప్రవర్తనలో మార్పు రాకపోగా, తదుపరి కూడా రకరకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ యొక్క ప్రతిపాదనల మేరకు వారి ఇద్దరి యొక్క క్రిమినల్ రికార్డు లను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఐఏఎస్ నిన్నటి రోజున ఇద్దరి మీద జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ...

జిల్లాలో ఇప్పటినుండి ఎవరైనా రౌడీయిజంతో అరాచక శక్తులుగా మారి , ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగజేసే విధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై జిల్లా బహిష్కరణతో పాటు గా పీడి యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించడం జరుగుతుందని, ప్రశాంతంగా,

మంచిగా, బుద్ధిగా జీవించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఇటువంటి చెడు నడత కలిగిన మరి కొందరి పై కూడా జిల్లా బహిష్కరణ గురించి పరిశీలనలో ఉన్నాయని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.

# వర్షపాతం నమోదుకు వర్షం మాపక కేంద్రాలు

**జూపాడు బంగ్లా మండలంలో... సీపీఓ నంద్యాల శ్రీ కే. ప్రకాష్ పర్యటన**





**జూపాడు బంగ్లా, సెప్టెంబర్ 08: (నంది పత్రిక)** నంద్యాల జిల్లా సీపీఓ కే. ప్రకాష్ మంగళవారం జూపాడు బంగ్లా మండల కేంద్రంలో ఆటోమేటిక్ వర్షమాపక కేంద్రం (ూాబౌా), రెవెన్యూ వర్షమాపక కేంద్రాలను మరియు గణాంక విభాగానికి సంబంధించిన రికార్డులనుపరిశీలించారు.ఈ సందర్భంగా ఆటోమేటిక్ వర్షమాపక కేంద్రం మరియు రెవెన్యూ వర్షమాపక కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వర్షపాతం నమోదు విషయంలోతీసుకోవాల్సిన చర్యలపై సహాయ గణాంక అధికారి ఏ. హనుమంతుకు తగిన సూచనలు,మార్గదర్శకాలు తెలియజేశారు .అనంతరం మండల కార్యాలయంలో తహశీల్దార్ కలిసి వర్షపాతం నమోదు మరియు ఆటోమేటిక్, రెవెన్యూ వర్షమాపక కేంద్రాలకు సంబంధించిన వివరాలనుసీపీఓకార్యాలయంలోని గణాంక విభాగానికి సంబంధించిన వర్షపాతం నమోదు, పంటల వివరాలు, రోజువారీ ధరల సేకరణ, పంటకోత ప్రయోగాలు (జజజు) తదితర రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, డేటా నమోదు మరియు సేకరణలో నిబంధనలను పాటించాలని సూచించారు.అనంతరం మండలంలోని సుష్మిత జనరల్ స్టోర్ మరియు రఫీ కిరాణం రోజువారీ ధరల సేకరణ కేంద్రాలను తనిఖీ చేసి, ధరల వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసి సంబంధిత అధికారులకు అందించాలని నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఈ పర్యటనలో సీపీఓ, నంద్యాల సీపీఓ కార్యాలయం, ఉప-గణాంక అధికారి ఎన్. ప్రసాద్ రెడ్డి, సహాయ గణాంక అధికారి ఏ. హనుమంతు, జూూాా ూాూా తరుణ్ తేజ్ మరియు ఆటోమేటిక్ వర్షమాపక కేంద్రాల టెక్నీషియన్లు శ్రీ శేషఫణి, శ్రీ ప్రతాప్ లు పాల్గొన్నారు.



## మరణించిన, పదవీ విరమణ పొందిన హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సహాయం.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ లో హోంగార్డ్స్ ఎక్స్‌గ్రేషియా నిధి, డిస్ట్రిక్ట్ కాంట్రిబ్యూషన్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్ అందజేశారు. మృతి చెందిన హోంగార్డులు కె. కృష్ణ, పి. మౌలాలి కుటుంబాలకు రూ.15,000 చొప్పున, పదవీ విరమణ పొందిన శ బత్తుల జ్ఞానరత్నమ్మ, కమ్మన్నలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐ పోతుల రాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

**వైఎస్ఆర్సిపి రాష్ట్ర సెక్రెటరీ సిట్రా సత్యనారాయణమ్మ**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షతన కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఎస్వీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వైఎస్సార్సీపీ సెక్రటరీ సిట్రా సత్యనారాయణమ్మ రాష్ట్ర వైస్సార్సీపీ మాధసి కురువ సంఘం అధ్యక్షులు గడ్డం రామకృష్ణ హాజరయ్యారు. జిల్లాలో పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణుల సన్నద్ధత, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలుపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. హామీల అమలు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ప్రజలకు వివరించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలుప్రస్తుత పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు, డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, పెరిగిన పెట్రోల్‌డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి అంశాలపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ప్రజల తరఫున బలమైన గొంతుకగా నిలవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, వైఎస్సార్సీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్‌లో కర్నూలు రేంజ్ పోలీసుల ప్రతిభ.

**పోలీసు అధికారులను అభినందించిన..**

**కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** గుంటూరులో నిర్వహించిన ఏపీ పోలీస్ డ్యూటీ మీట్‌లో సైంటిఫిక్ ఎయిడ్స్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినాలజీ విభాగంలో కర్నూలు రేంజ్ పోలీసులు రన్నర్ అప్ కప్ సాధించారు.ఈ సందర్భంగా మంగళవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ ని పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. రన్నర్ అప్ కప్ సాధించిన పోలీసు అధికారులను డీఐజీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, పులివెందుల ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, కర్నూలు త్రీటౌన్ ఎస్ఐ సామీర్ భాషా, కర్నూలు సీసీఎస్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి

**ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడాలి: వైఎస్ఆర్సిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి**



**కర్నూలు సిటీ నంది పత్రిక** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సమావేశంలో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం బలంగా పోరాడాలని సూచించారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలుపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలులో ప్రస్తుత పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు, డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలు, రైతులకు గిట్టుబాటు ధరలు, పెట్రోల్‌డీజిల్ ధరల పెరుగుదల, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి ప్రజా సమస్యలపై వైఎస్సార్సీపీ శ్రేణులు విస్తృతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ప్రజల తరఫున బలమైన గొంతుకగా వైఎస్సార్సీపీ నిలవాలని ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశానికి హాజరైన ప్రముఖులు: నంద్యాల జిల్లా పాణ్యం మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి , పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి , వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి , ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి , కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ , ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి , వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి , రామచంద్రారెడ్డి , చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి , రాంపుల్లయ్య , మణిగాంధీ , అహ్మద్ అలీఖాన్ , సురేందర్ రెడ్డి , సత్యనారాయణమ్మ, సిద్ధా రేణుకా రెడ్డి , గడ్డం రామకృష్ణ , అనిల్ , ఫిరోజ్ , అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అకడమిక్ క్యాలెండర్ల పంపిణీ



**చాగలమరి సెప్టెంబర్ 8 నంది పత్రిక** చాగలమర్రి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎం లకు అకడమిక్ క్యాలెండర్లను స్థానిక ఎం ఆర్ సి కార్యాలయం వద్ద ఎంఈఓ సయ్యద్ న్యామతుల్లా మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం పంపిణీ చేసిన అకడమిక్ క్యాలెండర్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొడిగనూరు జడ్పీపాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశ పెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజు వాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశ పెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహి ళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది.

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు

## మైనర్ డ్రైవింగ్‌పై కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు.

**18 మంది మైనర్లకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్.**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు ట్రాఫిక్ పోలీసులు రాజ్‌విహార్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. మోటార్ సైకిళ్లపై డ్రైవింగ్ చేస్తున్న 18 మంది మైనర్లను గుర్తించారు.వారిని కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు (చలాన్లు) విధించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని, మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని కర్నూల్ ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ హెచ్చరించారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఊరట

తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా వ్యవహరించారనే అభియోగాలపై పోలీసులు.. ఇవాళ ఉదయం తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసులు కోరిన రిమాండ్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను మంగళవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని నాంపల్లి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్ కోరారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇద్దరికీ వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయాలని ఆదేశించింది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com